Follow: @ANNTELUGU
25-03-2025
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 113 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## బడుగు బలహీన వర్గాలకు నిజమైన పండుగ

తెలంగాణలో బడుగు బలహీన వర్గాలు సంబురాలతో ప్రత్యేక పండుగ చేసుకునే చారిత్రాత్మక వాతావరణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది. రాజకీయంగా ఎలాంటి పరిణామాలు ఎదురైనా, ఎంతటి వ్యయప్రయాసాలైనా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలనే ఏకైక దృఢ సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మార్చి 17వ తేదీన, ఎస్సీ వర్గీకరణకు సంబంధించి మార్చి 18వ తేదీన బిల్లులను చట్టసభల్లో ఆమోదించి బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించడంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచింది.

-ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేక వ్యాసం 3లో

**టాప్ న్యూస్**

### బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడం తప్పే



- ఇక నుంచి అలా చేయం
- నాకు చట్టాలపై నమ్మకం ఉంది
- పోలీసుల విచారణకు సహకరిస్తా
- పోలీసుల విచారణకు హాజరైన యాంకర్ శ్యామల

03

### జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి కనిపించడం లేదు



- జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి కనిపించడం లేదంటూ
- బీజేపీ కార్పొరేటర్ ఫిర్యాదు!
- ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ శ్రవణ

03

### హిందూ సమాజానికి కేటీఆర్ క్షమాపణ చెప్పాలి



- అయోధ్య నుంచి వచ్చింది అక్షింతలా? లేక తలంబ్రాలా? అని కనీసం అవగాహన లేకుండా కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం
- బీజేపీ నేత రాణి రుద్రమ

03

## కాంగ్రెస్ పథకాలపై రాహుల్ ఆరా

### బీసీ బిల్లుపై అభినందన

అట్టడుగు వర్గాలకు ఫలాలు అందాలని సూచన
మంత్రివర్గంతో పాటు నామినేటెడ్, పార్టీ పదవులపైనా చర్చ
హైకమాండ్ అన్ని వివరాలు తీసుకుంది పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్






**హైదరాబాద్, మహా:** తెలంగాణపై హైకమాండ్ పూర్తి ఫోకస్ పెట్టింది. ఖుల్లంఖుల్లాగా అన్ని అంశాలపై చర్చించింది. ఢిల్లీ లోని ఇందిరా భవన్ లో కాంగ్రెస్ అధిష్టానం పెద్దలతో రాష్ట్ర కాంగ్రెస్ నేతల భేటీ గంటన్నరపాటు సోమవారం రాత్రి జరిగింది. ఏఐసీసీ నేతలు రాహుల్ గాంధీ , మల్లికార్జున ఖర్గే , కేసీ వేణుగోపాల్ లతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ జాతీయ కార్యాలయంలో సమావేశం అయ్యారు.

మిగతా 2లో



## ఉగాదికి మంత్రివర్గ విస్తరణ

### ఆరు బెర్త్‌లు.. అనేకమంది ఆశావహులు

బిసి 2, రెడ్డి లేదా వెలమ 1, ఎస్సీ,ఎస్టీ, మైనారిటీలకు ఒక్కోటి.. వివేక్, రాజగోపాల్ రెడ్డి, శ్రీహరి లకు లైన్ క్లియర్
పరిశీలనలో సుదర్శన్ రెడ్డి, ప్రేమ్ సాగర్, విజయశాంతి, ఆదిశ్రీనివాస్, రామచంద్రనాయక్
హైకమాండ్ పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్, భట్టి, ఉత్తమ్
కేసీ వేణుగోపాల్ తో కీలకచర్చలు.. తర్వాత ఖర్గే, రాహుల్ తో భేటీ.. సామాజికవర్గాలు, జిల్లాల వారీగా లెక్కలు

మంత్రివర్గ విస్తరణకు విఘ్నాలు తొలిగాయి. ఎఐసిసి ఇన్ ఛార్జిగా మీనాక్షి నటరాజన్ రాకతో పదవుల భర్తీలో వేగం పెరగ్గా, ఎంతో కాలంగా ముడిపడని విస్తరణకు లైన్ క్లియర్ అయింది. ఇప్పటికే పదిహేనుమాసాల టర్మ్ పూర్తికావడంతో ఇక ఆలస్యం చేయకూడదని అటు హైకమాండ్, ఇటు రాష్ట్ర నేతలు నిర్ణయానికొచ్చారు. పట్టువిడుపులతో ముందుకుసాగాలని నిర్ణయించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అయ్యాక మంత్రివర్గ విస్తరణపై ఏఐసీసీ దృష్టి సారించే అవకాశం ఉందని రాష్ట్ర నాయకత్వం భావించగా, పార్టీ అధిష్ఠానం తక్షణమే ఢిల్లీకి రావాలని పార్టీ కోర్ కమిటీ సభ్యులను పిలుపునివ్వడంతో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సీనియర్ నేత, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు ఢిల్లీ వెళ్లారు. - మహా, హైదరాబాద్

వివరాలు 3లో

## ఏప్రిల్ 15 నుండి సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

### 8 రోజులు జపాన్ లో పెట్టుబడుల వేట



హైదరాబాద్, మహా: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏప్రిల్ 15 నుంచి 23 వరకు జపాన్ లో పర్యటించనున్నారు. ఒకాసాలో ఐదేళ్ళకోసారి జరిగే ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ లో సీఎం పాల్గొంటున్నారు. సీఎంతో పాటు మంత్రి శ్రీధర్ బాబు కూడా పాల్గొంటారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను కోరనున్నారు.

## ప్రభుత్వాల హామీలు ఎట్లున్నాయంటే..

### అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఓవైసీ వ్యంగ్య కథ.. ఫన్నీ కథతో నవ్వులు పూయించిన అక్బరుద్దీన్



**మహా :** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న వేళ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సభలో తన ప్రత్యేక శైలిలో వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాలు ఇచ్చే హామీలు, అవి అమలయ్యే విధానం, ప్రజలకు అందే ప్రయోజనాలను ఉద్దేశించి ఆయన ఒక ఫన్నీ స్టోరీ చెబుతూ నేరుగా ప్రభుత్వ తీరును ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో ప్రసంగిస్తున్న అక్బరుద్దీన్ ఓవైసీ, హైదరాబాద్‌లో ఉన్న ఇద్దరు ఫేకులు గురించి ఒక కథను వినిపించారు. ఈ కథ ప్రభుత్వాలు చేసే వాగ్దానాలను నమ్మే పరిస్థితి ఎంత అసాధారణంగా మారిందో చాటిచెప్పే విధంగా ఉంది.

మిగతా 2లో



## ఒంటి చేత్తో ఢిల్లీని గెలిపించిన అశుతోశ్ శర్మ

ఉత్కంఠ భరిత పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ (DC vs LSG) బ్యాటర్ అశుతోశ్ శర్మ (31 బంతుల్లో 66 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుతాన్ని చేసి చూపించాడు. గెలిచే ఆశలు లేని చోట తన అద్భుత పోరాటంతో విజయాన్ని సాధించాడు.

వివరాలు 8లో

## రూ.10వేల కోట్ల భూ కుంభకోణం

### మ్యాన్ హట్టన్- వంశీరాం బిల్డర్స్ భూమి ప్రభుత్వానిదే

### ఈ స్కామ్ పై కేటీఆర్ మౌనం ఎందుకు?

- ఐఏఎస్ అమోయ్ కుమార్ రియల్ ఎస్టేట్ కంపెనీలతో కుమ్మక్కయ్యారు
- హైడ్రా నోటీసులు ఇచ్చి లావాదేవీలు నడిపిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి
- దీనిపై సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదుచేస్తా
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

03




## జడ్జి నివాసంలో నోట్ల కట్టలు

- కీలక నిర్ణయం తీసుకున్న ఢిల్లీ హైకోర్టు
- జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం
- నోట్ల కట్టలు బయటపడినట్టు వార్తలు
- ఆయనను న్యాయపరమైన విధుల నుంచి తప్పించిన ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రీ

02

## ఎస్ఎల్బీసీ సహాయక చర్యలు



- సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- నిపుణుల సలహాలతో ముందుకు వెళ్లాలని సూచన

02

## భార్యకు అక్రమ సంబంధం ఉందన్న రిప్లింగ్ సహ వ్యవస్థాపకుడు

భర్త ఒక కామపిశాచి అన్న భార్య.. రచ్చకెక్కిన బిలియనీర్ ఇంటి వ్యవహారం
పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్న ప్రసన్న శంకర్, దివ్య
అమెరికా కోర్టులో విడాకుల పిటిషన్.. నెలకు రూ.9 కోట్ల భరణంపై చర్చలు
అమెరికా నుంచి భారత్ చేరిన వ్యవహారం

వివరాలు 2లో

# భార్యకు అక్రమ సంబంధం ఉందన్న రిప్లింగ్ సహ వ్యవస్థాపకుడు

**భర్త ఒక కామపిశాచి అన్న భార్య**

- రచ్చకెక్కిన బిలియనీర్ ఇంటి వ్యవహారం
- పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్న ప్రసన్న శంకర్, దివ్య
- అమెరికా కోర్టులో విడాకుల పిటిషన్
- నెలకు రూ.9 కోట్ల భరణంపై చర్చలు
- అమెరికా నుంచి భారత్ చేరిన వ్యవహారం



**మహా :** ప్రముఖ హెచ్ఆర్ టెక్ స్టార్టప్ 'రిప్లింగ్' సహ వ్యవస్థాపకుడు, అనేక స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన చెన్నైకి చెందిన ప్రసన్న శంకర్ నారాయణ ప్రస్తుతం తన భార్యతో విడాకుల వివాదంలో చిక్కుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేస్తారేమోనని భయపడి ప్రస్తుతం తాను పరారీలో ఉన్నానని ఆయన స్వయంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం కలకలం రేపింది. ఈ వివాదం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసులో చెన్నై పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రశ్నించడం, ప్రధాని మోదీకి ట్యాగ్ చేస్తూ పోస్టులు పెట్టడం మరింత చర్చనీయాంశంగా మారింది.

**అసలేం జరిగిందంటే...**

ప్రసన్న శంకర్ నారాయణ, దివ్య దంపతులు. వారికి తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో అమెరికా కోర్టులో విడాకుల పిటిషన్ దాఖలైంది. దివ్య, అమె కుమారుడు అమెరికా పౌరులు. ఈ నేపథ్యంలో, భరణంగా నెలకు తొమ్మిది కోట్ల రూపాయలు చెల్లించాలని దివ్య డిమాండ్ చేయగా, దీనిపై చర్చలు జరుగుతున్నాయి.

**ప్రసన్న శంకర్ ఏమంటున్నారంటే...**

తన భార్య దివ్యకు వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయమై గొడవలు జరిగాయని వెల్లడించారు. అంతేకాకుండా, తన కుమారుడిని కిడ్నాప్ చేసినట్టు దివ్య ఫిర్యాదు చేసిందని, అంతర్జాతీయ పిల్లల అక్రమ రవాణాకు సంబంధించిన సెక్షన్లతో కేసు నమోదైందని వివరించారు. అయితే అమెరికా పోలీసులు, కోర్టు ఈ ఆరోపణలను విచారించి, అవి నిరాధారమైనవని తేల్చి తనకు అనుకూలంగా తీర్పునిచ్చాయన్నారు. ఆ తర్వాత కూడా. నేను దాడి చేసి అత్యాచారం చేసినట్టు, నగ్న వీడియోలు సర్క్యులేట్ చేస్తున్నట్టు దివ్య తనపై సింగపూర్ లో ఫిర్యాదు చేయగా, సింగపూర్ పోలీసులు తనకు క్లీన్ చిట్ ఇచ్చారని తెలిపారు.

**కుమారుడితో కలిసి భారత్ వచ్చిన దివ్య**

అమెరికా కోర్టు ప్రసన్నకు ప్రతి వారాంతంలో కుమారుడితో గడిపేందుకు అనుమతినిచ్చింది. వారం క్రితం దివ్య తన కుమారుడితో అమెరికా నుంచి చెన్నైకి వచ్చింది. అమెరికా కోర్టు ఆదేశాల మేరకు, ప్రసన్న తన స్నేహితుడు గోకుల్ ద్వారా కుమారుడిని వీకెండ్ లో తీసుకువెళ్లాడు. అయితే, దివ్య తన కుమారుడిని ప్రసన్న కిడ్నాప్ చేశాడని చెన్నై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే కుమారుడు తనతో సంతోషంగా ఆడుకుంటున్నాడని ప్రసన్న సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. దివ్య ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయని పోలీసులు, డబ్బుల కోసం డిమాండ్ చేశారని ప్రసన్న ఆరోపించారు. రూ.25 లక్షలు డిమాండ్ చేశారంటూ ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టడంతో ఈ వ్యవహారం మరింత వివాదాస్పదమైంది. కొడుకును కిడ్నాప్ చేసినట్టు తన భార్య దివ్య ఫిర్యాదు చేయడంతో, ప్రస్తుతం తాను చెన్నై పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నానని, పోలీసులు ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే తన మొబైల్ ఫోన్ లొకేషన్, కారు, యూపీఐ, ఐపీ అడ్రస్ లను ట్రాక్ చేస్తున్నారని ప్రసన్న శంకర్ ఆరోపిస్తున్నారు.

**దివ్య ఏమంటున్నారంటే**

తాను, తన కుమారుడు అమెరికా పౌరులమని దివ్య వెల్లడించారు. ప్రసన్న శంకర్ ఒక కామ పిశాచి అని భర్తపై సంచలన ఆరోపణలు చేశారు. రహస్యంగా మహిళల వీడియోలు రికార్డు చేసేవాడని తెలిపారు. ఈ కారణంగానే అతడు సింగపూర్ లో అరెస్టయ్యాడని, ఆ తర్వాత విడుదలయ్యాడని వివరించారు. తన పేరిట ఉన్న ఆస్తులను కూడా బదలాయించుకున్నాడని ఆరోపించారు.

# జడ్జి నివాసంలో నోట్ల కట్టలు

## కీలక నిర్ణయం తీసుకున్న ఢిల్లీ హైకోర్టు

**జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం.. నోట్ల కట్టలు బయటపడినట్టు వార్తలు**

**ఆయనను న్యాయపరమైన విధుల నుంచి తప్పించిన ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రీ**




**మహా :** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో పెద్ద మొత్తంలో నగదు కట్టలు బయటపడ్డాయన్న వార్తలు తీవ్ర కలకలం రేపాయి. ఈ నేపథ్యంలో దిల్లీ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ యశ్వంత్ వర్మను న్యాయపరమైన విధుల నుంచి తప్పిస్తూ ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రీ ప్రకటించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది.

**పోలీసులు సేకరించిన వీడియో ఆధారంగా**

జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు పోలీసులు తీసిన వీడియోలో కాలిపోయిన నోట్ల కట్టలు కనిపించాయి. ఈ వీడియోను ఢిల్లీ పోలీస్ కమిషనర్ ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయకు సమర్పించారు. ఆయన ఈ విషయాన్ని నివేదిక రూపంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు అందజేశారు. సుప్రీంకోర్టు ఈ విషయంపై వెంటనే స్పందించి, నివేదికలోని ఫొటోలు, వీడియోలతో సహా మొత్తం సమాచారాన్ని తన వెబ్ సైట్ లో ఉంచింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ వీలైనంత త్వరగా విచారణ ప్రారంభించనుంది. అయితే, విచారణకు సంబంధించిన తుది గడువును మాత్రం నిర్ణయించలేదు.

**ఆరోపణలను ఖండించిన జస్టిస్ యశ్వంత్ వర్మ**

మరో వైపు జస్టిస్ యశ్వంత్ వర్మ ఈ ఆరోపణలను ఖండించారు. తాను లేదా తన కుటుంబ సభ్యులు ఎవరూ గదిలో నగదు కట్టలు ఉంచలేదని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఇచ్చిన వివరణలో స్పష్టం చేశారు. ఇది తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు జరిగిన కుట్ర అని ఆయన పేర్కొన్నారు. తమ నగదు లావాదేవీలన్నీ బ్యాంకుల ద్వారానే జరుగుతాయని, తాము యూపీఐ మరియు కార్డులను ఉపయోగిస్తామని తెలిపారు. ఆ గదిని సాధారణంగా ఉపయోగించని ఫర్నిచర్, సీసాలు, పరుపులు, పాత స్పీకర్లు వంటి వస్తువులను భద్రపరచడానికి స్టోర్ రూమ్ లాగా ఉపయోగిస్తామని ఆయన వివరించారు.



## బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేయడం తప్పే


**ఇక నుంచి అలా చేయం**

- నాకు చట్టాలపై నమ్మకం ఉంది
- పోలీసుల విచారణకు సహకరిస్తా
- పోలీసుల విచారణకు హాజరైన యాంకర్ శ్యామల

**మహా :** బెట్టింగ్ యాప్ల ప్రమోషన్ వ్యవహారం కేసులో యాంకర్ శ్యామల పంజాగుట్ట పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. శ్యామలను పోలీసులు సుమారు మూడు గంటల పాటు విచారించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. బెట్టింగ్ యాప్ల కేసులో పోలీసుల విచారణకు తాను పూర్తి స్థాయిలో సహకరిస్తున్నట్లుగా శ్యామల తెలిపారు. బెట్టింగ్ యాప్లపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోంది. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందు వల్ల మాట్లాడటం అనఫిషియల్ అవుతుంది. పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తా, నాకు చట్టాలపై నమ్మకం ఉంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ తప్పు. బెట్టింగ్ యాప్ల వల్ల నష్టపోయిన కుటుంబాల లోటు ఎవరూ తీర్చలేనిది. ఇకపై బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేయమని శ్యామల పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని శ్యామల ఇటీవల న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో ఆమెను అరెస్టు చేయవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణకు సహకరించాలని శ్యామలకు సూచించింది. ఇదే కేసులో ఇప్పటికే విష్ణుప్రియ, రీతూచౌదరిని పంజాగుట్ట పోలీసులు విచారించిన విషయం విధితమే.

# వ్యభిచారం చేయాలని హైదరాబాద్‌లో బాలీవుడ్ నటిపై దాడి

**కాళ్ళు, చేతులు కట్టేసి హింసించిన అగంతకులు**



**మహా :** హైదరాబాద్ లో షాకింగ్ ఘటన జరిగింది. ఓ షాపింగ్ మాల్ ఓపెనింగ్ కు వచ్చిన బాలీవుడ్ నటిపై కొందరు దుండగులు దాడికి పాల్పడ్డారు. ఆమె బస చేసిన హోటల్ లోకి ప్రవేశించి అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. బాలీవుడ్ ఇండస్ట్రీకి చెందిన ఓ ప్రముఖ నటి హైదరాబాద్ లోని షాపింగ్ మాల్ ఓపెనింగ్ కు ఈనెల 18న ముఖ్య అతిథిగా వచ్చారు. ఆమె మాసబ్ ట్యాంక్, బంజారాహిల్స్ లోని ఓ హోటల్ లో బస చేశారు. అయితే ఈనెల 21న రాత్రి 9 గంటల సమయంలో ఆమె హోటల్ లో నిద్రిస్తున్న వేళ ఇద్దరు అమ్మాయిలు రూమ్ లోకి వచ్చారు. తమతో కలిసి వ్యభిచారం చేయాలని ఆమెను బలవంతం చేశారు. మరుసటి రోజు ఉదయం 11 గంటలకు ఇద్దరు అబ్బాయిలు ఆమె గదిలోకి చొరబడ్డారు. వాళ్లిద్దరూ ఆమెను రేప్ చేసేందుకు యత్నించారు. ఆమె తీవ్రంగా ప్రతిఘటించడంతో కాళ్లు,చేతులు కట్టేసి హింసించారు. అనంతరం ఆమె బ్యాగులోని రూ. 50,000 నగదు, కొంత బంగారంతో అక్కడి నుంచి పారిపోయారు. బాధితురాలు డయల్ 100కు ఫోన్ చేయడంతో సంఘటనాస్థలికి పోలీసులు చేరుకున్నారు. ఈ ఘటనపై మాసబ్ ట్యాంక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

# ప్రభుత్వాల హామీలు ఎట్లున్నాయంటే..

(మొదటి పేజీ తరువాయి)

"హైదరాబాద్‌లో ఇద్దరు ఫేకులు ఉండేవారు. వీరిద్దరూ ఫేకుల్లో కల్లా పెద్ద ఫేకులు. ఒకసారి వీరిద్దరూ కలిసి మాట్లాడుకుంటూ ఇలా గొప్పలు చెప్పుకున్నారని కథను చెప్పారు.

**మొదటి ఫేకు :** మా తాత దగ్గర ఉన్న భూమి ఎంతంటే, విత్తనాలు చల్లుకుంటూ వెళ్తే, ఆఖరి విత్తనం పడేంత సమయంలో మొదటి విత్తనం కోతకు వచ్చేస్తుంది.

**రెండో ఫేకు:** మా తాత దగ్గర ఒక పెద్ద వెదురు బొంగు ఉంది. అది ఎంత పెద్దగా ఉందంటే, ఆకాశంలో ఇటు నక్షత్రాలను అటు, అటు నక్షత్రాలను ఇటు జరిపేంత పొడవుగా ఉంటుంది.

**మొదటి ఫేకు:** అంత పెద్ద బొంగు ఎక్కడ దాచిపెట్టావ్?

**రెండో ఫేకు:** మీ తాత భూమిలో!

ఈ కథను వినిపించడంతో అసెంబ్లీలో సభ్యులు ఒక్కసారిగా నవ్వులు పూయించారు. అయితే, ఈ కథ వెనుక అక్బరుద్దీన్ ఓవైసీ చెప్పాలనుకున్న అర్థం వేరే ఉంది.

**ప్రభుత్వాల హామీలు – ఖజానా ఖాళీ!**

అక్బరుద్దీన్ వ్యంగ్యంగా చెప్పిన ఈ కథ ద్వారా ప్రభుత్వాల హామీల తీరును ఎత్తిచూపారు. ప్రభుత్వాలు ప్రజలకు ఎన్నో హామీలు ఇస్తుంటాయి. అయితే, ఆ హామీలను నెరవేర్చడానికి అవసరమైన నిధులు లేవు. 'ఇది చేస్తాం, అది ఇస్తాం' అంటూ ప్రజలను విశ్వసింపజేసేలా హామీలు ఇస్తూ, ఆర్థిక భారం పెంచుకుంటే రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపోతోందని ఆయన అన్నారు. కేవలం ప్రచార హామీలతో కాకుండా, నిజంగా



అమలు చేయగలిగే విధంగా హామీలు ఇచ్చి, ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'నేను ఎవరినీ లక్ష్యంగా వ్యాఖ్యలు చేయడం లేదు, కానీ మధ్య తరగతి ప్రజలు నలిగిపోతున్నారు' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఓవైసీ చెప్పిన కథ వినిపించగానే నవ్వులు పూశాయి. అయితే, ఆ కథకు అంతర్భాగమైన ప్రభుత్వాల హామీలు, ఆర్థిక స్థితిగతుల మధ్య అంతరం అందరికీ అర్థమైంది. ప్రభుత్వాలు చాలా హామీలు ఇచ్చినా, ప్రయోజనం పొందే స్థాయిలో ప్రజలకు అందడం లేదు. ఈ వ్యాఖ్యల ద్వారా, ప్రభుత్వ విధానాలను పునఃసమీక్షించి, అసలు లబ్దిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**తొలిసారేమీ కాదు**

అక్బరుద్దీన్ ఓవైసీ తన ప్రసంగ శైలిలో వ్యంగ్యాన్ని మేళవించడం కొత్తేమీ కాదు. గతంలో కూడా ఆయన ప్రభుత్వ విధానాలను, హామీలను, ఆచరణలో ఉంచే తీరును విమర్శిస్తూ అనేక సందర్భాల్లో తన ప్రత్యేకమైన శైలిలో వ్యాఖ్యానించారు. ఈ కథ కూడా అలాంటిదే! మొత్తానికి, అసెంబ్లీలో ఓవైసీ చెప్పిన కథ నవ్వులు తెప్పించినా, దాని వెనక ఉన్న అసలైన సందేశం ముఖ్యమైంది. ప్రభుత్వాలు పరిశీలనాత్మకంగా, ప్రజలకు నిజమైన ప్రయోజనం కలిగేలా నిర్ణయాలు తీసుకోవాలని ఈ కథ ద్వారా ఆయన సూచించారు.



## ఎస్ఎల్బీసీ సహాయక చర్యలు

- సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- నిపుణుల సలహాలతో ముందుకు వెళ్లాలని సూచన

**మహా :** ఎస్ఎల్ బీసీ టన్నెల్ లో సహాయక చర్యలు చేపట్టి నెల రోజులు దాటినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదు. ఇప్పటి వరకు ఒక మృతదేహాన్ని మాత్రమే వెలికి తీశారు. ఈ క్రమంలో ఎస్ఎల్బీసీ సహాయక చర్యలపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్ లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యల నిరంతర పర్యవేక్షణ కోసం సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. సహాయక చర్యలు నిరంతరం కొనసాగేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సహాయక చర్యలకు కేంద్రం నుంచి అవసరమైన అనుమతులను త్వరగా తీసుకోవాలని ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా సహాయక చర్యలను నిపుణుల సలహాలతో ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు.

**సహాయక చర్యల్లో భాగంగా డ్రిల్ అండ్ బ్లాస్ట్ విధానం**

ఇప్పటివరకు ప్రమాదంలో చిక్కుకున్న 8 మందిలో ఒక్కరి మృతదేహాన్నిమాత్రమే వెలికి తీసిన సహాయ బృందాలు ఏడుగురి కోసం అన్వేషణ కొనసాగిస్తున్నాయి. అనుమానిత ప్రాంతాలైన డీ1, డీ2 వద్ద తవ్వకాలు జరిపినా ఇప్పటికీ కనీస ఆనవాళ్లు కూడా లభించలేదు. ఇక డీ1 నుంచి ప్రమాదం జరిగిన ప్రదేశం వరకూ 50 మీటర్ల మేర సహాయక చర్యలు చేపట్టే పరిస్థితి లేదు. అక్కడ రెస్క్యూ చేపట్టేందుకు రోబోటిక్స్‌ను లోపలికి పంపినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. మృతదేహాలను వీలైనంత త్వరగా బయటకు తీసేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. తాత్కాలిక చర్యలతో పాటు, శాశ్వత చర్యలపై కూడా దృష్టి పెట్టాలని మార్గనిర్దేశనం చేశారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకెళ్లాలన్న ముఖ్యమంత్రి, ఎన్ జీఆర్ఐ, జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాతో అధ్యయనం చేసి ముందుకు వెళ్లాలన్నారు.

# బెట్టింగ్ యాప్‌ల కేసుల్లో కీలక పరిణామం

**నిందితుల జాబితాలో యజమానులు**

**జాబితాలో మొత్తం 19 యాప్‌ల యజమానులు**



**మహా :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన బెట్టింగ్ యాప్‌ల కేసుల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మియాపూర్‌లో నమోదైన కేసులో భాగంగా యాప్‌ల యజమానులను పోలీసులు నిందితుల లిస్టులో చేర్చారు. కాగా ఈ జాబితాలో మొత్తం 19 యాప్‌ల యజమానులున్నారు. జిగిల్ రమ్మీ డాట్ కామ్, ఏ 23, యోలో 247, ఫెయిర్ ప్లే, జీత్‌విన్‌తో పాటు విబుక్, తాజ్ 77, వివి బుక్, ధనిబుక్ 365, మామ247, తెలుగు 365, ఎస్ 365, జై365, జెట్ఎక్స్, పరిమ్యాచ్, తాజ్777బుక్, ఆంధ్రా365 యాప్‌ల యజమానులను పోలీసులు నిందితుల జాబితాలో చేర్చారు. ఈ మేరకు పోలీసులు వారికి నోటీసులు ఇచ్చి విచారించనున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు సహా 25 మందిపై కేసు నమోదైన విషయం విధితమే.

**దర్యాప్తు ముమ్మరం**

బెట్టింగ్ యాప్‌ల వ్యవహారం కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఆరుగురు ప్రముఖ నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సహా మొత్తం 25 మందిపై పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. దగ్గుబాటి రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, ప్రణీత, నీతూ అగర్వాల్‌పై కొద్ది రోజుల క్రితమే కేసు నమోదు చేశారు. శ్యామల, శ్రీముఖి, రీతూ చౌదరి, విష్ణుప్రియ, వర్షిణి, అనన్య నాగళ్ల, సిరి హనుమంతు, వసంతి కృష్ణన్, శోభాశెట్టి, అమృత చౌదరి, నాయని పావని, నేహా పఠాన్, పద్మావతి, పండు, ఇమ్రాన్‌ఖాన్, హర్షసాయి, బయ్యా సన్నీ యాదవ్, టేస్టీ తేజ, బండారు సుప్రీతపై కేసులు పెట్టారు. మియాపూర్ వాసి ప్రమోద్ శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు.

## గ్రూప్-1 మెయిన్స్ రీవాల్యుయేషన్ జరిపించాలి

**హైకోర్టులో అభ్యర్థుల పిటిషన్**


**మహా :** గ్రూప్ 1 పరీక్ష ఫలితాలు ఈ నెల 10న విడుదలయ్యాయి. ఉద్యోగ ఖాళీలను పెండింగ్ పెట్టొద్దని ఆదేశాలిచ్చానని, పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలోనే ఫలితాలు ఇచ్చామని, 30, 40 రోజుల్లో గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తామని ఈ నెల 20న సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రీకౌంటింగ్‌కు సోమవారం చివరి రోజు. ఈ తరుణంలో గ్రూప్ 1 అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. గ్రూప్ 1 పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ జరిపించాలని అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గ్రూప్ 1 మూల్యాంకనం లోపభూయిష్టంగా జరిగిందని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. 18 రకాల సబ్జెక్టులు ఉంటే 12 సబ్జెక్టుల నిపుణులతోనే పేపర్లను దిద్దించారని, 3 భాషల్లో పరీక్ష జరిగినా తగిన నిపుణులతో దిద్దించలేదని వారు తెలిపారు. ఒకే మాధ్యమంలో నిపుణులు అయిన వారితో ఇంగ్లీష్, తెలుగు మీడియం పేపర్లు మూల్యాంకనం చేయించారని, అలా చేయడం వల్ల మూల్యాంకనంలో నాణ్యత లోపించిందని, తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పిటిషనర్లు పేర్కొన్నారు. పిటిషనర్ల వాదనలు విన్న హైకోర్టు టీజీపీఎస్సీకి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని టీజీపీఎస్సీని ధర్మాసనం ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను హైకోర్టు 4 వారాలకు వాయిదా వేసింది. దీంతో గ్రూప్ 1 నియామకాలు భర్తీ చేయడం ఆలస్యమవుతుందేమోనని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

# నాకేం తెలియదు

**చావే శరణ్యం అంటున్న డిబార్ అయిన టెన్త్ స్టూడెంట్**

**నకిరేకల్ లో 10 వ తరగతి ప్రశ్నాపత్రం లీక్.. విద్యార్థినిని డిబార్ చేసిన అధికారులు**

**లీక్ కు కారకులని 11 మందిని గుర్తించిన పోలీసులు**




**మహా :** నకిరేకల్ లో పదవ తరగతి పరీక్ష పత్రం లీక్ అయిన వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో ప్రశ్నాపత్రం లీక్ అయ్యింది. గోడ దూకి పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించిన కొంతమంది వ్యక్తులు ప్రశ్నాపత్రాన్ని ఫొటో తీసుకుని వెళ్లారు. ఆపై జవాబులను జిరాక్స్ తీయించి పరీక్ష రాస్తున్న కొందరు విద్యార్థులకు అందించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే పోలీసులు వారిని పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో విద్యార్థినిని డిబార్ చేయగా పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్ మెంటల్ ఆఫీసరును విధుల నుంచి తప్పించారు. అయితే పేపర్ లీక్ ఘటనలో తనకు ఏ పాపం తెలియదని విద్యార్థిని బల్లెం ఝాన్సీలక్ష్మీ వాపోతుంది. ఎగ్జామ్ సెంటర్ లో కిటికీ పక్కన కూర్చుని పరీక్ష రాస్తుండగా.. ఇద్దరు యువకులు తనను బెదిరించి ఫోటో తీసుకున్నారని చెబుతోంది. ప్రశ్నాపత్రం చూపించకపోతే రాయితో కొడతామని బెదిరించారని వెల్లడించింది. అందుకే ఆ సమయంలో భయం వేసి, ఏం చేయాలో అర్థం కాక క్వశ్చన్ పేపర్ చూపించానని చెప్పింది. పేపర్ ను ఫొటో తీసుకుని యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారని వివరించింది. పక్కన ఉన్నవారు కూడా ఏం కాదులే చూపించు అన్నారని.. ఇందులో తన ప్రమేయం ఏమిలేదని కన్నీటి పర్యంతం అవుతోంది. దయచేసి తనను పరీక్ష రాసేందుకు అనుమతించాలని.. ఎవరో చేసిన దానికి తనను బలి చేయొద్దంటూ వేడుకుంటుంది. దయచేసి మళ్లీ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరుతుంది. పరీక్షల్లో చూసి రాయాల్సిన అవసరం తనకు లేదని విద్యార్థిని ఝాన్సీలక్ష్మి స్పష్టం చేసింది. ఎగ్జామ్ రాయనియ్యకపోతే తనకు చావే శరణ్యం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది. తమ కూతురుని పరీక్ష రాయనివ్వాలని విద్యార్థిని తల్లిదండ్రులు సైతం కోరుతున్నారు. కూలీ పనులు చేసుకుంటూ బిడ్డను చదివిస్తున్నామని.. తన భవిష్యత్తును అంధకారం చేయొద్దని వేడుకుంటున్నారు. ఇక ఈ ఘటనలో పోలీసులు 11 మందిపై కేసు నమోదు చేయగా ఇప్పటికే ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సమాచారం.

# జులై 3 నుంచి 5వ తేదీ వరకు తానా కాన్ఫరెన్స్

**సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం**

**డెట్రాయిట్ లో జరగనున్న సభలకు రేవంత్ ను ఆహ్వానించిన తానా ప్రతినిధులు**

**ఇప్పటికే చంద్రబాబును ఆహ్వానించిన తానా ప్రతినిధులు**

**మహా :** తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) సభలకు సర్వం సిద్ధమవుతోంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే తానా సభలు ఈ ఏడాది జులై 3 నుంచి 5వ తేదీ వరకు డెట్రాయిట్ లో జరగనున్నాయి. ఈ క్రమంలో తానా 24వ సభలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తానా ప్రతినిధులు సోమవారం కలిసి ఆహ్వానించారు. జూబ్లీహిల్స్ లో ఉన్న రేవంత్ నివాసానికి వెళ్లిన తానా ప్రతినిధులు ఆయనకు ఆహ్వానపత్రికను అందించారు. రేవంత్ ను కలిసిన వారిలో తానా కాన్ఫరెన్స్ ఛైర్మన్ నాదెళ్ల గంగాధర్, మాజీ అధ్యక్షుడు కోమటి జయరామ్, కాన్ఫరెన్స్ డైరెక్టర్ సునీల్ పాంత్ర, చందు గొర్రెపాటి, శశి దొప్పాలపూడి ఉన్నారు. ఇప్పటికే ఈ కాన్ఫరెన్స్ కు హాజరుకావాలంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం అందించారు. పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలకు కూడా ఆహ్వాన పత్రికలు అందించారు.

# బడుగు బలహీన వర్గాలకు నిజమైన పండుగ



**తెలంగాణలో బడుగు బలహీన వర్గాలు సంబురాలతో ప్రత్యేక పండుగ చేసుకునే చారిత్రాత్మక వాతావరణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది. రాజకీయంగా ఎలాంటి పరిణామాలు ఎదురైనా, ఎంతటి వ్యయప్రయాసాలైనా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలనే ఏకైక దృఢ సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మార్చి 17వ తేదీన, ఎస్సీ వర్గీకరణకు సంబంధించి మార్చి 18వ తేదీన బిల్లులను చట్టసభల్లో ఆమోదించి బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించడంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచింది.**



-బి.మహేశ్ కుమార్ గౌడ్,
ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు

జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయం జరగాలనే లక్ష్యంతో దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని జాతీయ స్థాయిలో డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో ప్రయోగాత్మకంగా పూర్తి చేసింది. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ తెలంగాణలో కులగణన చేపడుతామని చెప్పారు. అందుకు తగ్గట్టు అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ కామారెడ్డిలో 2023 నవంబర్లో నిర్వహించిన బీసీ డిక్లరేషన్లో కులగణపై హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకొని శాస్త్రీయ పద్ధతిలో కులగణనను విజయవంతంగా పూర్తి చేసింది. అంతేకాక అనుకోని కారణాలతో ఎవరైనా నమోదు చేసుకోని వారికి కూడా నష్టం జరగకూడదనే సంకల్పంతో వారికి రెండోసారి అవకాశం కల్పించి కాంగ్రెస్ తన మానవ దృక్పథాన్ని చాటుకుంది. జనాభాలో సగంపైగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి న్యాయం చేయాలనే లక్ష్యంతో తెలంగాణలో దిగ్విజయంగా కులగణనను పూర్తి చేసిన కాంగ్రెస్ ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలబడిరది. మరోవైపు ఎస్సీ వర్గీకరణపై ఉన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తొలి రాష్ట్రంగా కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో తెలంగాణ చరిత్ర సృష్టించింది. బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం చేయాలని కంకణం కట్టుకున్న కాంగ్రెస్ కులగణన పూర్తి చేసి చేతులు దులుపుకోకుండా ఆ ఫలాలు నిజమైన లబ్ధిదారులకు అందించేందుకు వేగవంతమైన చర్యలు తీసుకుంది. శాస్త్రీయంగా చేపట్టిన కులగణనలో రాష్ట్రంలో 56 శాతానికిపైగా బీసీ జనాభా ఉందని నిర్ధారణ కావడంతో వారికి విద్యా, ఉపాధి, స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టసభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదానికి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిస్వార్థంగా కృషి చేసింది. కాలయాపన జరగకుండా తెలంగాణలోని బడుగు బలహీన వర్గాలకు త్వరగా సామాజిక న్యాయం అందేందుకు కేంద్ర ప్రభుత్వంపై అన్నివైపుల నుండి ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ఎలాంటి సాంకేతిక, న్యాయపరమైన చిక్కులు ఎదురవకుండా రాజ్యాంగం 9వ షెడ్యూల్లో చేర్చి రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత తేవాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వాన్ని కోరుతోంది.

బీసీలకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వానికి ప్రతిపక్ష పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ రాజకీయాలకు అతీతంగా సహకరించాలి. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు రాష్ట్ర బీజేపీ నేతలు కృషి చేయాలి. తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్లతో పాటు మిగతా ఆరుగురు ఎంపీలు కూడా బీజేపీ అధిష్టానాన్ని ఒప్పించి బీసీ రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించి తమ నిబద్ధతను చాటుకోవాలి. మరోవైపు బాధ్యత గల ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ కూడా కేంద్రంలోని బీజేపీపై బిల్లు చట్టబద్ధత కోసం ఒత్తిడి తీసుకురావాలి. కేంద్రంలో బిల్లు ఆమోదం కోసం రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలను కలుపుకొని పోయేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉన్నట్టు ఇప్పటికే ప్రకటించింది. అనుకోని కారణాలతో కేంద్రంలో బిల్లు ఆమోదానికి ఏమైనా ఆలస్యం జరిగినా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం టికెట్లిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ప్రకటించి సామాజిక న్యాయంపై తమకున్న నిబద్ధతను నిరూపించుకుంది. బీఆర్ఎస్, బీజేపీ నుండి కూడా ఇదేతరహా స్పందన ఆశించినా ఇప్పటి వరకూ సానుకూల పరిణామాలు, ప్రకటనలు వెలువడలేదు.

దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఎస్సీ వర్గీకరణ బిల్లుపై సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు స్వాగతిస్తూ మాటలకే పరిమితం కాకుండా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో అడుగులు వేసింది. సుప్రీం కోర్టు తీర్పు అనంతరం ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించి ఇందులో కూడా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచి సామాజిక న్యాయం అందించడంలో అందరి కంటే ముందుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి నిరూపించుకుంది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు అనంతరం తెలంగాణ ప్రభుత్వం దీనిపై అధ్యయనానికి రిటైర్డ్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో కమిషన్ నియమించింది. ఎస్సీల్లో 59 వర్గాలకు సంబంధించిన అక్షరాస్యత, ఉపాధి, నియామకాలు, వారి ఆర్థిక స్థితిగతులు, రాజకీయ అవకాశాలపై సమాచారాన్ని సేకరించిన కమిషన్ కూలంకుషంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

డాక్టర్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదిక సూచనలు మేరకు రిజర్వేషన్ల ఫలితాలు అందరికీ దక్కాలనే ఆశయంతో ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించి అందరికీ సామాజిక న్యాయం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు రూపొందించింది. గ్రూప్ 1లో 15, గ్రూప్ 2లో 18, గ్రూప్ 3లో 26 కులాలను చేర్చి మూడు గ్రూపుల్లోని 59 కులాలకు 15% రిజర్వేషన్లు కల్పించారు. ఏకపక్ష నిర్ణయం తీసుకోకుండా, ఎలాంటి అనుమానాలకు తావులేకుండా రిజర్వేషన్ల ప్రయోజనాలు అందరికీ దక్కేలా జాతీయ ఎస్సీ కమిషన్ను కూడా తెలంగాణ ప్రభుత్వం సంప్రదించి అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా ఎస్సీ వర్గీకరణ బిల్లు సభలో ప్రవేశపెట్టి ఆమోదింప చేసి అన్ని వర్గాలకు న్యాయం చేసింది.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి అనేక చర్యలు తీసుకుంటుంటే ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేయడం శోచనీయం. కులగణన ప్రక్రియను బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కూడబలుకొని తప్పుపట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. బీసీల సంఖ్యను తక్కువగా చూపుతున్నారంటూ విమర్శిస్తున్న ఈ పార్టీలు ఏ లెక్కల ఆధారంగా మాట్లాడుతున్నారో స్పష్టత లేదు. కులగణన సర్వే లెక్కలు తప్పంటూ బీఆర్ఎస్ అనధికారికంగా సమగ్ర కుటుంబ సర్వే లెక్కలను చెబుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భయానక వాతావరణం సృష్టించి ఒక ప్రహసనంగా నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే నివేదిక వివరాలను వారి పాలనలో ఎందుకు బహిర్గతం చేయలేదో చెప్పాలి. ఇప్పుడు వారు చెబుతున్న గణాంకాలకు ఆధారాలేమిటో చూపాలి. అవి సమగ్ర కుటుంబ సర్వే లెక్కలే అయితే ఇంతకాలం గోప్యంగా ఉంచడానికి కారణాలేమిటో ఆ పార్టీ నాయకత్వం స్పష్టం చేయాలి. సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం బీసీ జనాభా కులగణన సర్వే లెక్కల కంటే అధికంగా ఉంటే బీఆర్ఎస్ పాలనలో స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుండి 23 శాతానికి ఎందుకు తగ్గించారు..?

సామాజిక న్యాయం కోసం ఎవరైనా రిజర్వేషన్లు పెంచుతారు కానీ, బీఆర్ఎస్ అప్పుడు రిజర్వేషన్లు తగ్గించి వారికి అన్యాయం చేసి, ఇప్పుడు బీసీలపై మొసలి కన్నీరు కారుస్తోంది. దేశంలో గతంలో ప్రతి పదేళ్లకు జనాభా లెక్కల్ని సేకరించేవారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక జనాభా లెక్కలకు బ్రేక్ పడింది. దీంతో అధికారిక లెక్కలు లేకపోవడంతో ప్రధానంగా బడుగు బలహీన వర్గాల వారు హక్కులు కోల్పోతున్నారు. దేశంలో జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా చేపట్టాలని కాంగ్రెస్ కోరుతున్నా నరేంద్ర మోదీ ప్రభుత్వంలో చలనం లేదు. మరోవైపు కులగణనపై రాష్ట్ర బీజేపీ నేతలు బీసీలో ముస్లింలను ఎలా కల్పుతారని మతపరంగా రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. బీజేపీ మోడల్ రాష్ట్రమైన గుజరాత్లో ముస్లింలు బీసీల్లో ఉండగా, ప్రశ్నించలేని వీరు ఇక్కడ మతం పేరుతో ఉద్రిక్తతలు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారు. జాతీయ పార్టీ అయిన బీజేపీ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానం అనుసరిస్తుందా అనేదానిపై స్పష్టత ఇవ్వాలి. కాంగ్రెస్ పార్టీ అందించిన అభయహస్తంతో తెలంగాణలోని బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం లభించడంతో వారు పండుగ వాతావరణంలో సంబురాలు చేసుకుంటున్నారు. సామాజిక న్యాయానికి నిత్యం పెద్ద పీట వేసే కాంగ్రెస్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ, ఎస్సీ వర్గీకరణ చేస్తూ చట్టసభల్లో బిల్లులను ఆమోదించి కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాల పక్షపాత ప్రభుత్వమని మరోసారి నిరూపించుకుంది. తెలంగాణలో సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు గుడ్డిగా తప్పు పట్టడమే లక్ష్యంగా విమర్శలు చేసే బదులు సహకరిస్తే బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి చేయూత అందిచ్చిన వారవుతారు.

# ఉగాదికి మంత్రివర్గ విస్తరణ

**హైదరాబాద్, మహా:** మంత్రివర్గ విస్తరణకు విఘ్నాలు తొలిగాయి. ఏఐసిసి ఇన్ ఛార్జిగా మీనాక్షి నటరాజన్ రాకతో పదవుల భర్తీలో వేగం పెరగ్గా, ఎంతో కాలంగా ముడిపడని విస్తరణకు లైన్ క్లియర్ అయింది. ఇప్పటికే పది హేనుమాసాల టర్మ్ పూర్తికావడంతో ఇక ఆలస్యం చేయకూడదని అటు హైకమాండ్, ఇటు రాష్ట్ర నేతలు నిర్ణయానికొచ్చారు. పట్టువిడుపులతో ముందుకుసాగాలని నిర్ణయించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అయ్యాక మంత్రివర్గ విస్తరణపై ఏఐసీసీ దృష్టిసారించే అవకాశం ఉందని రాష్ట్ర నాయకత్వం భావించగా, పార్టీ అధిష్ఠానం తక్షణమే ఢిల్లీకి రావాలని పార్టీ కోర్ కమిటీ సభ్యులను పిలుపునివ్వడంతో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సీనియర్ నేత, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డిలు ఢిల్లీ వెళ్లారు. కాంగ్రెస్ అగ్ర నేతలు ఖర్గే, రాహుల్గాంధీ, కేసీ వేణుగోపాల్తో రాష్ట్ర నేతల సమావేశం అయ్యారు. ప్రధానంగా మంత్రి వర్గ విస్తరణపైనే పార్టీ అధిష్ఠానం చర్చించి, పార్టీలో కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

### లైన్ క్లియర్ ? :

ఇటీవల రెండు రోజుల కిందట సీఎం రేవంత్రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేష్కుమార్ గౌడ్, ఇతర నాయకులు దాదాపు రెండు గంటలపాటు చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం ఆకస్మికంగా పార్టీ అధిష్ఠానం పిలుపుతో మంత్రివర్గ విస్తరణే ప్రధాన అంశంగా చర్చకు నేతలు ఢిల్లీ వెళ్ళారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు పార్టీ అధిష్ఠానం ఇచ్చిన హామీ మేరకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వివేక్లను మంత్రి వర్గంలోకి తీసుకోవాలన్న యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఉన్న ఆరింటిలో రెండు మంత్రి పదవులు అధిష్ఠానం కోటా కింద పోతే మరో నాలుగు మాత్రమే మిగులుతాయి. అందులో ఒకటి ముదిరాజ్ సామాజిక వర్గానికి ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. అదే విధంగా ప్రాతినిధ్యం లేని జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలను మంత్రి వర్గంలోకి తీసుకోవాలని రాష్ట్ర కమిటీ యోచిస్తోంది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజక వర్గం నుంచి సుదర్శన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డిలు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరిముదిరాజ్ ఒక్కడికి అందరి నుంచి మద్దతు లభిస్తోంది. ఒక మైనార్టిటీ ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వారికి ఇవ్వాలని యోచిస్తున్నప్పటికీ ఆ స్థాయిలో ఎవరు కనిపించకపోవడంతో అందుబాటులో ఉన్న మండలి సభ్యులను ఇందుకు రంగంలోకి దింపుతారా అనేది స్పష్టత రాలేదు. ఇప్పటి వరకు జరిగిన సంఘటనలను బట్టి చూస్తే విజయశాంతి పేరు బాగా ప్రచారం జరుగుతోంది. అయితే జీహెచ్ ఎంసీ, స్థానిక ఎన్నికలను పరిగణలోకి తీసుకుని గ్రేటర్ హైదరాబాద్ పరిస్థితుల ఆధారంగా నిర్ణయం ఉండే అవకాశముంది.

### ఇదీ ఫార్ములా

అధిష్టానం లెక్క ప్రకారం ప్రస్తుతం ఆరు ఖాళీల్లో బిసిలకు 2, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఒక్కోటి, రెడ్డి లేదా వెలమకు మరో స్థానం ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదనంగా ఇవ్వాలనుకుంటే ఇపుడున్న వారిలోనే.. ఒకరో ఇద్దరికో కత్తెర వేస్తే తప్ప సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో పెద్దగా సంచలనాలు లేకుండా కూర్పును పూర్తిచేసే యోచనలో హైకమాండ్, కీలకనేతలు ఉన్నారు. మైనారిటీ స్థానం అవసరమైతే పెండింగ్ పెట్టి తర్వాత భర్తీ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. బీసీ నుండి వాకిటి శ్రీహరి పేరు దాదాపు ఖరారు కాగా, మరో స్థానం కోసం ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, విజయశాంతి పోటీపడుతున్నారు. నల్లగొండ జిల్లా సమీకరణల రీత్యా బీర్ల ఐలయ్యకు ఛాన్స్ దక్కకపోవొచ్చు. రెడ్డి నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి రేసులో ఉండగా, వెలమ నుండి ప్రేమ్సాగర్ రావు ఉన్నారు. ఎస్సీల నుంచి వివేక్, అద్దంకి దయాకర్ రేసులో ఉన్నారు. ఇక ఎస్టీల నుంచి రేసులో బాలు నాయక్, రాంచందర్ నాయక్ ఉండగా.. మైనార్టీల నుంచి కొత్తవారికి ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ చేసిన తర్వాత స్థానిక ఎన్నికలకు వెళ్ళే యోచనలో హైకమాండ్ ఉంది.

## కాంగ్రెస్ పథకాలపై రాహుల్ ఆరా




(మొదటిపేజీ తరువాయి)

దాదాపు గంటన్నర పాటు జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర రాజకీయాలపై పలు కీలక విషయాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న మంత్రివర్గ విస్తరణ పై చర్చ జరిగింది. ఈ సమావేశం అనంతరం పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఈ సమావేశంలో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గంపై చర్చ జరిగిందని తెలిపారు. అలాగే కార్పొరేషన్ చైర్మన్లు, బోర్డుల నియామకం పై చర్చ జరిగిందని అన్నారు. అంతేగాక తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ఖర్గే, రాహుల్ గాంధీ అడిగి తెలుసుకున్నారని, ఆహారం, విద్యా వ్యవహారాలపై కూడా ఆరా తీశారని తెలిపారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుపై వివరణ అడిగారని చెప్పారు. అన్నీ అంశాలపై సమగ్ర సమాచారం తీసుకున్నారని, త్వరలోనే అన్ని అంశాలు కొలిక్కి వస్తాయని ఆశిస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు

# హిందూ సమాజానికి కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

అయోధ్య నుంచి వచ్చింది అక్షింతలా? లేక తలంబ్రాలా? అని కనీసం అవగాహన లేకుండా కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం..
బీజేపీ నేత రాణి రుద్రమ



**హైదరాబాద్, మహా:** హిందూ సమాజానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె.. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. అయోధ్య నుంచి అక్షంతలు రాలేదని, రేషన్ బియ్యాన్ని అయోధ్య అక్షింతలు అని చెప్పి పంపిణీ చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ ఆరోపిస్తున్నారని, అయోధ్య నుంచి వచ్చింది అక్షింతలా? లేక తలంబ్రాలా? అని కనీసం అవగాహన కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కేటీఆర్ కు అక్షింతలకు, తలంబ్రాలకు తేడా తెలియదని, అయోధ్యలో ఉన్న బాల రాముడికి, సీతారాముల వారికి తేడా తెలియదని ఎద్దేవా చేశారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యంతో పోల్చి, హిందువుల మనోభావాలను దెబ్బతీసిన కేటీఆర్ హిందు సమాజానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. అలాగే కేటీఆర్ కు రంజాన్ వచ్చినప్పుడు ముస్లింలను శాంతపరచాలి కాబట్టి హిందు దేవుళ్లను కించపరచాలి అనే ఆలోచన వస్తుందని మండిపడ్డారు. ఎప్పుడు రంజాన్ వచ్చినా అప్పుడు కేసీఆర్ ఎన్నికల సమయంలో ముస్లింల ఓట్లు గంపగుత్తగా దండుకునే రాజకీయ కుట్రతో హిందుత్వాన్ని కిందచ పరుస్తారని అన్నారు.

## జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి కనిపించడం లేదు

- జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి కనిపించడం లేదంటూ బీజేపీ కార్పొరేటర్ ఫిర్యాదు!
- ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ శ్రవణ్

**మహా:** జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి కనిపించడం లేదని మల్కాజ్గిరి బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని సమస్యలపై ఆమె శ్రద్ధ చూపడం లేదని శ్రవణ్ ఆరోపించారు. కనీసం ఆమె కార్యాలయంలో కూడా అందుబాటులో ఉండటం లేదని ఆయన అన్నారు. నగరంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ, మేయర్ వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. వివిధ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారం కోసం ఆమె స్వయంగా పర్యటించడం లేదని పేర్కొన్నారు. కనీసం కార్యాలయంలో కూడా ఆమె అందుబాటులో ఉండకపోవడంతో సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని అన్నారు. పలు ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత, చెత్త సమస్య, రోడ్ల దుస్థితి వంటి అంశాలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై మేయర్ దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

# రూ.10వేల కోట్ల భూ కుంభకోణం

**మ్యాన్ హట్టన్- వంశీరాం బిల్డర్స్ భూమి ప్రభుత్వానిదే**

**ఈ స్కామ్ పై కేటీఆర్ మౌనం ఎందుకు?**
**ఐఏఎస్ అమోయ్ కుమార్ రియల్ ఎస్టేట్ కంపెనీలతో కుమ్మక్కయ్యారు**
**హైడ్రా నోటీసులు ఇచ్చి లావాదేవీలు నడిపిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి**
**దీనిపై సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదుచేస్తా**
**కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మహా:** గత కొద్దిరోజులుగా భూ వ్యవహారాలు, హైడ్రాపై వరుస బాంబులు పేలుస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. తాను వెలుగులోకి తెచ్చిన భూ కుంభకోణం గురించి త్వరలోనే అన్ని విషయాలు బయట పెడతానని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు. మ్యాన్హట్టన్ వంశీరాం బిల్డర్స్ భూమి ప్రభుత్వానిదేనని వ్యాఖ్యానించారు. దీనిపై పూర్తి సమాచారం తెలుసుకునేందుకు ఆర్టీఐ కి కూడా దరఖాస్తు చేశానని, త్వరలోనే అన్ని వివరాలు ఆధారాలతో సహా బయటపెడతానని స్పష్టం చేశారు. మ్యాన్హట్టన్ వంశీరాం బిల్డర్స్ భూమి రూ.10 వేల కోట్ల స్కామ్ అని, గత ప్రభుత్వం వంశీరాం బిల్డర్స్ కు 27 ఎకరాలు కట్టబెట్టిందని చెప్పారు. దీనిపై అప్పటి ఐఏఎస్ అమోయ్ కుమార్ పై అనుమానం ఉందని, ఆయన రియల్ ఎస్టేట్ కంపెనీలతో కుమ్మక్కయ్యారని అన్నారు.

**ఆ కంపెనీతో బీఆర్ఎస్ లాలూచీ**

ఇంత విలువైన భూమి విషయంపై బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని, ఆ రియల్ ఎస్టేట్ కంపెనీతో బీఆర్ఎస్ లాలూచీ ఏంటని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. అంతేగాక బీఆర్ఎస్ హయాంలో అక్కడ వంద ఫీట్ల రోడ్డు ఎందుకు వేశారో చెప్పాలన్నారు. హైడ్రా పై కేటీఆర్ ట్వీట్ చేశారు. కానీ మ్యాన్ హట్టర్ వంశీరాం స్కామ్ పై ఎందుకు మౌనం వహిస్తున్నారని అనిరుధ్ రెడ్డి నిలదీశారు. కాగా గత కొద్ది రోజుల క్రితం మ్యాన్ హట్టర్ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హైడ్రాపై సంచలన ఆరోపణలు చేశారు. హైడ్రా నోటీసులు ఇచ్చి లావాదేవీలు నడిపిస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయని, కబ్జాలపై ఫిర్యాదు చేసినా హైడ్రా సరిగ్గా స్పందించడంలేదని అన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎన్ని సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడని, ఎమ్మెల్యేకే స్పందించకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని మండిపడ్డారు.



# పౌరసరఫరాల సంస్కరణలు దేశానికే ఆదర్శం

15 నెలలో అద్భుత ప్రగతి.. అక్రమార్కులపై ఉక్కుపాదం.. రూ. 409 కోట్ల విలువైన బియ్యం స్వాధీనం
ఐఐఎం సదస్సులో పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. చౌహాన్

**మహా :** ఏడాదిన్నర కాలంగా పౌరసరఫరాల శాఖలో చేపట్టిన సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. చౌహాన్ అన్నారు. పౌరసరఫరాల విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రజలకు చేరువ చేశామని , ప్రజా పంపిణీ ద్వారా పేదలకు నాణ్యమైన సరుకులను సకాలంలో అందించడమే కాకుండా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు జరుపుతున్నామని వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో చెల్లింపులు జరుపుతున్నామని తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా మరియు సిఎంఆర్ ఎగవేసిన మిల్లర్లపై ఉక్కు పాదం మోపుతున్నామని, గత 15 నెలల్లో రూ. 409 కోట్ల విలువచేసే బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఛత్తీస్గఢ్ రాజధాని రాయపూర్లోని ఐఐఎంలో జరిగిన అంతర్జాతీయ నాయకత్వ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా చౌహాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడచిన 15 నెలల కాలంలో తెలంగాణ ప్రభుత్వం పౌరసరఫరాల శాఖలో చేపట్టిన సంస్కరణలు, వాటి ఫలితాలను వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వీలైనంతమేరకు వినియోగించుకొని అక్రమాలకు అడ్డుకట్ట వేశామని, వంద శాతం రూట్ ఆప్టిమైజేషన్ మైలురాయిని సాధించి తెలంగాణ భారతదేశంలో మొదటి రాష్ట్రంగా నిలిచిందని, ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వానికి సంవత్సరానికి రూ. 12 నుంచి 15 కోట్లు ఆదా అవుతుందన్నారు. పేద ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడానికి వీలుగా రేషన్ పంపిణీ కోసం ఆధునిక చౌక ధరల దుకాణాల (జన్ పోషణ్ కేంద్ర) అమలు మరియు ఈపాస్ టెక్నాలజీని ఉపయోగించడం జరుగుతుందన్నారు. వరి ధాన్యం సేకరణలో వాతావరణ అంచనా సాంకేతికతను దేశంలోనే తెలంగాణ తొలిసారిగా ప్రవేశపెట్టడం జరిగిందని, దీనివలన రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వ బియ్యాన్ని (సీఎంఆర్) మిల్లర్ల నుంచి గడువులోగా సేకరిస్తున్నామని, గతంలో బియ్యాన్ని ఎగవేసిన సీఎంఆర్ డిఫాల్టర్లు మరియు బియ్యం అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవడం వల్ల రూ. 409 కోట్ల విలువైన బియ్యం రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. పీడీఎస్ బియ్యం జప్తు కేసులు 9 రెట్లు పెరిగాయన్నారు. నాణ్యమైన తెలంగాణ బియ్యం ఎగుమతి కోసం ఫిలిప్పీన్స్ తో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా బియ్యం ఎగుమతుల్లో తెలంగాణ స్థానాన్ని బలోపేతం చేయడం జరిగిందన్నారు. ప్రతినెలా తెలంగాణ ప్రభుత్వం 17 వేల రేషన్ షాపుల ద్వారా 89. 52 లక్షల కుటుంబాలకు 1 లక్షా 81 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తుందని ఈ బియ్యం నాణ్యత సరిగా లేకపోవడం వల్ల పేదలు బియ్యం తీసుకోవడానికి ఇష్టపడేవారు కాదని ఏడాది కాలంగా బియ్యం నాణ్యతను పూర్తి స్థాయిలో మెరుగుపరచడం జరిగిందని క్షేత్రస్థాయిలో సిబ్బంది రాజీ పడకుండా నాణ్యమైన బియ్యాన్ని మిల్లర్లనుంచి తీసుకునేలా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల నుంచి రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యాన్ని సరఫరా చేయబోతున్నామని ప్రకటించారు. కఠినమైన నాణ్యత నియంత్రణ చర్యలు, సాంకేతిక పర్యవేక్షణ మరియు రైతుఆధారిత చర్యలతో సహా ఆయన అమలు చేసిన సాహసోపేతమైన విధాన పరమైన మార్పులు పౌర సరఫరాల రంగంలో దేశ వ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. ఏప్రిల్ 2025 నుండి ప్రజా పంపిణీ వ్యవస్థలో బలవర్ధకమైన సన్న బియ్యం (ఫోర్టిఫైడ్) ప్రవేశపెట్టడం వంటి రాష్ట్ర ప్రభుత్వ చర్యలు అమలు చేయడం ద్వారా ఆహార నాణ్యతను పెంపొందించడం విషయములో మరియు రైతుల శ్రేయస్సు పట్ల ఆయన నిబద్ధతను మరింత నొక్కి చెబుతాయన్నారు.

EDITORIAL సంపాదకీయం

# కాంగ్రెస్ ప్రధాన శత్రువా? మరి బీజేపీ?



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

నిజానికి కేసీఆర్ పార్టీకి ప్రధాన శత్రువు కాంగ్రెస్ కాదు..రేవంత్ రెడ్డి. ఇది చాలామందికి అర్థం కాదు. రేవంత్ రెడ్డిని ఢీకొని,ఓడించడమే బిఆర్ఎస్ లక్ష్యం. రేవంత్ మైనస్ కాంగ్రెస్ పార్టీకి తమను ఎదుర్కొనే బలం లేదని కేసీఆర్ అవగాహన. ఓ వైపు బీజేపీ తెలంగాణను కైవసం చేసుకోవడానికి 'సునామీ'లా దూసుకు వస్తుంటే ఆ పార్టీ గురించి పల్లెత్తు మాట అనడం లేదు.బీజేపీ దూకుడు కనబడడం లేదనుకోవాలా? లేక బీజేపీ తమకు సమీప ప్రత్యర్థిగా భావించడం లేదని అనుకోవాలా? లేక నెమ్మదిగా 'కనిపించని కార్పెట్'ను బీజేపీకి పరచాలని అనుకుంటున్నారా ?



''తెలంగాణకు మొదటి నుంచి ప్రధాన శత్రువు కాంగ్రెస్ పార్టీయే.తెలంగాణ సాయుధ పోరాట కాలం నుంచి నేటి దాకా పలు సందర్భాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నో మోసాలు చేసింది. నెహ్రూ సహా ఇందిరాగాంధీ,సోనియాగాంధీ నుంచి నేటిదాకా తెలంగాణకు కాంగ్రెస్ పలు ద్రోహాలకు పాల్పడింది. తెలంగాణను ఆంధ్రాలో కలపడం నుంచి,1969లో వందలాది మంది బిడ్డలను పొట్టన పెట్టుకోవడం నుంచి, నీళ్లు నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు దశాబ్దాల కాలంగా జరిగిన అన్యాయాలకు కాంగ్రెస్ పార్టీయే కారణం''.మార్చి 22 న తన ఫార్మ్ హౌస్ లో పార్టీ నాయకులు,కార్యకర్తలతో అన్నారు.అయితే అదే 'ప్రధాన శత్రువు'తో పొత్తు పెట్టుకొని కేసీఆర్ 2004 ఎన్నికల్లో పోటీ చేశారు. అదే 'ప్రధాన శత్రువు' పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లు ఆమోదానికి కీలక భూమిక పోషించింది.'' సోనియాగాంధీ చొరవ వల్లనే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైంది.తెలంగాణ సంస్కారం ఎంత గొప్పగా ఉంటుందో ప్రపంచానికి చాటాల్సి ఉంది.అందుకే ఆమెకు కృతజ్ఞతలు చెబుతున్నా. శ్రీమతి సోనియాగాంధీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా. ఐయామ్ ఆన్ రికార్డ్. సోనియా వల్లనే మన కల సాకారమైంది.ఎవరికీ అనుమానం అవసరం లేదు.రాష్ట్ర ముఖ్యమంత్రిగా తెలంగాణ శాసనసభ ప్రధమ సమావేశంలో ఈ విషయాలు చెబుతున్నా'' అని కేసీఆర్ 2014 లో చెప్పారు.

> **2014,2018 ఎన్నికల్లో రెండుసార్లు తెలంగాణ ప్రజలు ఆయనకు అధికారం ఇచ్చారు.2023 లో తాము అధికారం కోల్పోతామని కేసీఆర్ ఊహించలేదు. 2022 నుంచి రాజకీయ పరిణామాలు వేగంగా చోటు చేసుకున్నాయి.పీసీసీ అధ్యక్షునిగా పగ్గాలు చేబట్టిన మరు క్షణం నుంచీ రేవంత్ రెడ్డి కొదమ సింహం వలె విరుచుకుపడి బిఆర్ఎస్ ను తునాతునకాలు చేశారు.కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి సంబంధించి ఆయన కాంట్రిబ్యూషన్ గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన పని లేదు.**

నిజానికి కేసీఆర్ పార్టీకి ప్రధాన శత్రువు కాంగ్రెస్ కాదు..రేవంత్ రెడ్డి. ఇది చాలామందికి అర్థం కాదు. రేవంత్ రెడ్డిని ఢీకొని,ఓడించడమే బిఆర్ఎస్ లక్ష్యం. రేవంత్ మైనస్ కాంగ్రెస్ పార్టీకి తమను ఎదుర్కొనే బలం లేదని కేసీఆర్ అవగాహన. ఓ వైపు బీజేపీ తెలంగాణను కైవసం చేసుకోవడానికి 'సునామీ'లా దూసుకు వస్తుంటే ఆ పార్టీ గురించి పల్లెత్తు మాట అనడం లేదు. బీజేపీ దూకుడు కనబడడం లేదనుకోవాలా?లేక బీజేపీ తమకు సమీప ప్రత్యర్థిగా భావించడం లేదని అనుకోవాలా?లేక నెమ్మదిగా 'కనిపించని కార్పెట్'ను బీజేపీకి పరచాలని అనుకుంటున్నారా ? వంటి ప్రశ్నలకు తండ్రి లేదా కొడుకు మాత్రమే జవాబు చెప్పగలరు. 2014,2018 ఎన్నికల్లో రెండుసార్లు తెలంగాణ ప్రజలు ఆయనకు అధికారం ఇచ్చారు.2023 లో తాము అధికారం కోల్పోతామని కేసీఆర్ ఊహించలేదు.2022 నుంచి రాజకీయ పరిణామాలు వేగంగా చోటు చేసుకున్నాయి.పీసీసీ అధ్యక్షునిగా పగ్గాలు చేబట్టిన మరు క్షణం నుంచీ రేవంత్ రెడ్డి కొదమ సింహం వలె విరుచుకుపడి బిఆర్ఎస్ ను తునాతునకాలు చేశారు.కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి సంబంధించి ఆయన కాంట్రిబ్యూషన్ గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన పని లేదు.తాను పన్నిన వ్యూహాలే తన మెడకు చుట్టుకున్న విషయాన్ని అంగీకరించడానికి కేసీఆర్ సిద్ధంగా లేరు.'తెలంగాణ ఇంటి పార్టీ' బిఆర్ఎస్ మాత్రమే కనుక మిగతా రాజకీయపక్షాలేవీ ఈ రాష్ట్రంలో మనుగడలో ఉండడానికి వీల్లేదని కేసీఆర్ భారీ ప్రణాళిక రచించి అమలుచేశారు. టీడీపీ,కాంగ్రెస్ సహా కమ్యూనిస్టు పార్టీలను 'ఖతం' చేయడానికి గట్టిగా ప్రయత్నించారు.ఇందుకు గాను,అధికారబలం,ధనబలం,కండబలం అన్నింటినీ వాడారన్న ఆరోపణలున్నవి.తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు,ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మూటా ముల్లె సర్దుకొని విజయవాడ వెళ్లిపోవడంతో ఆ పార్టీ ఇక్కడ పూర్తిగా నిర్వీర్యమైంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను కూడా బిఆర్ఎస్ లో చేర్చుకున్నారు. 2018 2023 మాదే శాసనసభలో కాంగ్రెస్ బలం 6 గురు మాత్రమే.బీజేపీకి ఒక్కరే ఉండేవారు.తన వ్యూహం ఫలించిందని,ఇక తనకు అడ్డు ఎవరూ లేరని కేసీఆర్ అనుకున్నారు.రాజకీయాల్లో రెండు ప్లస్ రెండు నాలుగు కాదని అర్థమయ్యే నాటికి ఆయన 'మాజీ' గా మారిపోయారు.

''రాజకీయాల్లో మీకు శత్రువులు ఉండి తీరవలసిందే. లేనట్లయితే మీరే ఒక శత్రువును తయారు చేసుకోవాలి. శత్రువు బలాబలాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అతనికి తగినట్లుగా మార్పులు చేసుకుంటూ,మలచుకుంటూ విజయం సాధించే సామర్థ్యాన్ని బుద్ధి కుశలత (జీనియస్) అంటారు''.అని క్రీస్తు పూర్వం 4 వ శతాబ్దానికి చెందిన యుద్ధరంగ నిపుణుడు సుంజు అన్నాడు. సుంజు చెప్పిన బుద్ధికుశలత కేసీఆర్ లో టన్నుల కొద్దీ ఉన్నది.అయితే తన బుద్ధికుశలతపై ఆయనకు అపారమైన విశ్వాసం.ఆ తెలివితేటలతో ఎవరినైనా చిత్తు చేయవచ్చునని,ఎంతటి వారినయినా సులభంగా బోల్తా కొట్టించవచ్చునని,ఎవరినయినా భయపెట్టవచ్చునని, లొంగదీసుకోవచ్చునని కేసీఆర్ అనుకునేవారు.ఇప్పటికీ ఆయన అదే మానసికస్థితిలో ఉన్నట్టు కనిపిస్తోంది.ఏ రాజకీయ నాయకుడయినా తనను తాను గొప్ప వ్యక్తిగా భావిస్తుంటాడు.అందులో తప్పు పట్టవలసిందేమీ లేదు. మనం అధికారంలోకి రాగలమన్న విశ్వాసం కలిగించలేకపోతే ఇక ఆ నాయకుడ్ని,ఆ రాజకీయ పార్టీని క్యాడర్ ఎలా నమ్మగలదు?

> **తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు,ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మూటా ముల్లె సర్దుకొని విజయవాడ వెళ్లిపోవడంతో ఆ పార్టీ ఇక్కడ పూర్తిగా నిర్వీర్యమైంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను కూడా బిఆర్ఎస్ లో చేర్చుకున్నారు. 2018 - 2023 మాదే శాసనసభలో కాంగ్రెస్ బలం 6 గురు మాత్రమే.బీజేపీకి ఒక్కరే ఉండేవారు.తన వ్యూహం ఫలించిందని,ఇక తనకు అడ్డు ఎవరూ లేరని కేసీఆర్ అనుకున్నారు. రాజకీయాల్లో రెండు ప్లస్ రెండు నాలుగు కాదని అర్థమయ్యే నాటికి ఆయన 'మాజీ' గా మారిపోయారు.**

2018 ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా లేకుండా చేసి,ఐదారుగురు ఎమ్మెల్యేలు కూడా ఆ పార్టీకి లేకుండా చేసి,ఇక రాష్ట్రమంతటా 'గులాబీ' జెండా తప్ప మరొక జెండా లేకుండా చేయాలని ప్రయత్నించడమే వ్యూహాత్మక తప్పిదం.'మోడీయా ,బోడీయా' అంటూ ప్రధాని మోడీని కూడా తూలనాడి,ఇష్టమొచ్చిన రీతిలో దూషించి,తాను ఢిల్లీలో కాలు మోపితే మోడీ పరారవుతారని వ్యాఖ్యలు చేశారు.జాతీయ స్థాయిలో తన లాంటి తెలివితేటలు కలిగిన 'మొనగాడు' మరొకరు లేరనే ఉద్దేశంతో జాతీయపార్టీని ఏర్పాటు చేయడం చారిత్రిక తప్పిదం.''నా హయాంలో తెలంగాణలో సమస్యలన్నీ పరిష్కారమయిపోయాయి.ప్రజలు సకల సుఖాలు పొందుతున్నారు. రాష్ట్రం సుభిక్షంగా మారిపోయింది.ఇక దేశ రాజధానికి వెళ్లి దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పులు తీసుకురావలసిందే.జాతీయ స్థాయిలో నా సత్తా ఏమిటో చూపవలసిందే.దేశంలో ఉన్న వనరులన్నింటినీ ఎట్లా సద్వినియోగం చేసుకోవాలో నాకు తెలుసు.ఇప్పటి పాలకులకేమీ తెలియదు.వాళ్లంతా అజ్ఞానులు''అని కేసీఆర్ తన మనసులో గట్టిగా నిర్ణయించుకున్నారు.వీటిలో కొన్ని సంగతులు బహిరంగంగానే చెప్పారు.

''ఈ సారి తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఉంటే పరిస్థితులు మరోలా ఉండేవి'' అని కేసీఆర్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఒక సందర్భంలో అన్నారు.అంటే తెలంగాణలో 'హ్యాట్రిక్' సాధించి ఉంటే,ఆయన గ్యారంటీగా ఢిల్లీ బాట పట్టేవారు.తృటిలో జాతీయ రాజకీయాల్లో ఆ అదృష్టం మిస్సయిపోయింది.తెలంగాణ మైదానాన్ని వదిలి జాతీయ రాజకీయాలను గడ గడ లాడించాలనుకోవడమే అవివేకపు చర్యగా రాజకీయ పరిశీలకుల భావన.14 ఏండ్ల పాటు స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన మనిషి,ఈ రాష్ట్రాన్ని సకల సమస్యల నుంచి ఎట్లా విముక్తి చేయాలో,పేదరికం, నిరుద్యోగం ఎట్లా నిర్మూలించాలో ఆలోచించకుండా ఏకంగా 'ప్రధాని' కావాలన్న ఆకాంక్ష తెలంగాణ ప్రజలకు రుచించనిది.కేసీఆర్ లో ఎన్ని మైనస్ పాయింట్లు ఉన్నా,ఇప్పటికీ ఆయనే ఒక 'బ్రాండ్'.కేటీఆర్,హరీశ్ రావు,కవితలకు అలాంటి 'బ్రాండ్' ఇమేజ్ రాలేదు. బిఆర్ఎస్ లో ఎవరి పెర్ఫార్మెన్స్ ఎలా ఉందని 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' చాట్ లో ప్రశ్నిస్తే కవిత మెరుగ్గా ఉన్నట్టు జవాబు వచ్చింది.కేటీఆర్ వ్యూహాత్మకంగా వెడుతున్నట్టు,హరీశ్ రావుకు మార్కెటింగ్ ప్రతిభ లేనట్టు ఆ జవాబులో వివరణ కూడా వచ్చింది.

> **''ఈ సారి తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఉంటే పరిస్థితులు మరోలా ఉండేవి'' అని కేసీఆర్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఒక సందర్భంలో అన్నారు.అంటే తెలంగాణలో 'హ్యాట్రిక్' సాధించి ఉంటే,ఆయన గ్యారంటీగా ఢిల్లీ బాట పట్టేవారు.తృటిలో జాతీయ రాజకీయాల్లో ఆ అదృష్టం మిస్సయిపోయింది. తెలంగాణ మైదానాన్ని వదిలి జాతీయ రాజకీయాలను గడ గడ లాడించాలనుకోవడమే అవివేకపు చర్యగా రాజకీయ పరిశీలకుల భావన.**

కేసీఆర్ ఎంత గంభీరంగా ప్రసంగాలు చేసినా ఆయనకు అభద్రతాభావం ఎక్కువ.అందువల్లనే ఆయన ఎవరినీ నమ్మరు.తన పదవికి,లేదా ప్రాధాన్యానికి ఎలాంటి ప్రమాదం ఉన్నట్టు అనుమానించినా ఆయన సహించరని ఆ పార్టీకి చెందిన వారే ఆఫ్ ద రికార్డులో చెబుతుంటారు.అధికారంలోకి వచ్చినప్పుడు మొదటి టర్మ్ లో హరీశ్ రావుతో ప్రభుత్వానికి ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతోనే ఆయనపై నిఘా పెట్టినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది.హరీశ్ పై నిఘాకు స్వయంగా కేటీఆర్ ఇంటెలిజెన్స్ వర్గాలను పురమాయించారంటూ విమర్శలు వచ్చాయి.దానిపై బావ,బామ్మర్దుల మధ్య మాటల యుద్ధం జరిగిందనీ,ఆ పంచాయితీ కేసీఆర్ వరకు వెళ్లిందనీ మరో ప్రచారం నడిచింది.

> **తాను పన్నిన వ్యూహాలే తన మెడకు చుట్టుకున్న విషయాన్ని అంగీకరించడానికి కేసీఆర్ సిద్ధంగా లేరు.'తెలంగాణ ఇంటి పార్టీ' బిఆర్ఎస్ మాత్రమే కనుక మిగతా రాజకీయపక్షాలేవీ ఈ రాష్ట్రంలో మనుగడలో ఉండడానికి వీల్లేదని కేసీఆర్ భారీ ప్రణాళిక రచించి అమలుచేశారు. టీడీపీ,కాంగ్రెస్ సహా కమ్యూనిస్టు పార్టీలను 'ఖతం' చేయడానికి గట్టిగా ప్రయత్నించారు. ఇందుకు గాను, అధికారబలం, ధనబలం,కండబలం అన్నింటినీ వాడారన్న ఆరోపణలున్నవి.**

''తెలంగాణలో వచ్చేసారి ఎన్డీయే కూటమి రావాలని కొన్ని పత్రికలు రాస్తున్నయి.తెలంగాణను చిన్నాభిన్నం చెయ్యడానికి కొందరు రెడీగా ఉన్నరు.తెలంగాణ యువత అప్రమత్తంగా ఉండాలె.ఎప్పటికప్పుడు తెలంగాణను ఆగం చేసే కుట్రలను పసిగట్టి రాష్ట్రాన్ని కాపాడుకోవాలె''.అని తెలంగాణ కాపలాదారు కేసీఆర్ వ్యాఖ్యానించారు.హైదరాబాద్ నగర సంపదపై కొంతమంది కన్ను పడినట్టు కూడా కేసీఆర్ అన్నట్టుగా వార్తలు వచ్చాయి.కేసీఆర్ హయాంలోనే యువరాజు ,ఆయన అనుచరులు,మద్దతుదారులు,భజన మండలి హైదరాబాద్ చుట్టుపక్కల భూములు,ఇతర వనరులన్నింటినీ కొల్లగొట్టి పారేశారంటూ ఆరోపణలు ఉన్నాయి.ఇక మరొకరు 'దంచడానికి' సంపద ఎక్కడున్నదో కెసిఆర్ కు మాత్రమే తెలిసి ఉండాలి.లేదా ఆయనకు ఉపన్యాస సహకారం చేసే మనుషులకయినా తెలిసి ఉండాలి.

''కత్తి ఒకరికిచ్చి యుద్ధం నన్ను చేయమంటే ఎలా''? అని బిఆర్ఎస్ అధ్యక్షుడు అంటున్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఈ కామెంట్లు ప్రజలకు 'కిక్కు' ఇచ్చి ఉండవచ్చు.ఇప్పుడు కత్తి ఎవరి చేతిలో ఉంది? యుద్ధం ఎవరితో చేయవలసి ఉన్నది? కత్తి అంటే ప్రస్తుత పరిస్థితుల్లో 'అధికారం' అని మనం అర్థం చేసుకోవాలి. అధికారంలో ఉంటే చంద్రబాబు వంటి రాజకీయ శక్తులను తెలంగాణ రాష్ట్రంలోనికి రానివ్వకుండా 'యుద్ధం' చేస్తారని అనుకోవలసి వస్తుంది.మనందరికీ తెలిసినంతవరకు తెలంగాణ యుద్ధం ముగిసింది.కేసీఆర్ విజేత. ఆయన పదేండ్ల తర్వాత కూడా ఇంకా 'కత్తి యుద్ధం' గురించి మాట్లాడడం విడ్డూరమే.ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ వనరులు దోచుకుంటున్న వారిపై 'యుద్ధం' చేయడానికి తనకు 'కత్తి'ఇవ్వాలని కేసీఆర్ కోరితే ప్రజలు ఆయనకే కత్తినిచ్చారు.ఆయనే యుద్ధం చేశారు. చావు నోట్లోకి పోయి వాపసు వచ్చారు.తెలంగాణ ఏర్పడి దాదాపు 11 ఏండ్లు గడచిపోయాయి.పదేండ్లు రాష్ట్రాన్ని ఆయనే పాలించారు.ఇప్పుడు తాజాగా కత్తి ఎందుకు? ఎవరిపై యుద్ధం చేయడానికి ?ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,బీజేపీకి చెందిన కేంద్రమంత్రులు బండి సంజయ్,కిషన్ రెడ్డి,సిపిఐ,సీపీఎం,తదితర పార్టీల నాయకులంతా తెలంగాణ పౌరులే.పరాయి వాళ్ళు కాదు.పర పీడన అంతకన్నా లేదు.మరి కత్తి కేసీఆర్ కు ఎందుకు అవసరమవుతున్నదో బిఆర్ఎస్ జ్ఞానులు చెప్పాలి.

అధికారం లేనందుకు,తాను సీఎం కానందుకు కేసీఆర్ లోపల అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయని పరిశీలకులంటున్నారు.అందుకే తక్షణం అధికారం కావాలని ఆయన,ఆయన పరివారం కోరుకుంటున్నారు. అధికారం లేకుండా అరక్షణం కూడా కేసీఆర్ కుటుంబ సభ్యులు,బంధువులు,వారి సామాజికవర్గం ఉండలేకపోతున్నారన్న చర్చ తెలంగాణ సమాజంలో జరుగుతోంది.''ఎమ్మెల్యేగా ఉంటే మజా లేదు'' అని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి బహిరంగంగానే అన్నారు. ఆయనే అలా అంటున్నారంటే ''మేమే తెలంగాణ మాదే తెలంగాణ'' అని భావిస్తున్న కేసీఆర్ పరివారం ఎమ్మెల్యేలుగా కొనసాగడం ఇంకెంత కష్టమో ఊహించవచ్చు.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# సినీ ఇండస్ట్రీకి ఐపీఎల్ దెబ్బ

ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) జరిగే సమ్మర్ సీజన్‌లో సినిమా ఇండస్ట్రీపై దాని ప్రభావం ఉంటుందా? అంటే ఖచ్చితంగా అవును అనే సమాధానమే వినిపిస్తుంది.ఇప్పటికే ఓటీటీ లతో డీలా పడిన థియేటర్లు ఐపీఎల్ దెబ్బను రెండు నెలలు భరించాల్సిందే. అయితే పాన్ ఇండియా మూవీస్, బిగ్ బడ్జెట్, పెద్ద హీరోలు, మంచి కంటెంట్ ఉన్న సినిమాలు మినహా మిగతా చిన్నా చితకా సినిమాలకు థియేటర్ల వద్ద ఈ రెండు నెలలు సందడి ఉండక పోవచ్చు. తలనొప్పి ఎందుకని సినిమాల రిలీజ్ లను వాయిదా వేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఐపీఎల్ కారణంగా సినిమా థియేటర్లలో ప్రేక్షకుల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది. ఎందుకంటే క్రికెట్‌కు పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్న మనదేశంలో ఆ ఆటకున్న క్రేజ్ అలాంటిది.ముఖ్యంగా ఐపీఎల్ మ్యాచ్‌లు సినిమా ఫస్ట్ షో సెంకడ్ షో ప్రైమ్ టైమ్‌లో ప్రసారమయ్యే కారణంగా, జనాలు సినిమా చూసేందుకు వెళ్లకుండా ప్రత్యక్షంగా మ్యాచ్ చూడటానికో లేదా టీవీ లేదా మొబైల్ స్క్రీన్లకు అతుక్కుపోయే అవకాశం ఉంటుంది.వేసవి సెలవులు సినిమాకి మంచి మార్కెట్ డేస్ . కాని ఐపీఎల్ కున్న క్రేజ్‌తో థియేటర్లు చివరి రెండు షోలు బోసి పోతున్నాయి.ఐపీఎల్‌ను సినీ ఇండస్ట్రీ స్ట్రాటజిక్ గా ఒక ఛాన్స్‌లా కూడా మార్చుకోవాలి.తమ సినిమాల ట్రైలర్లు, టీజర్లు ఐపీఎల్ మ్యాచ్ ల మధ్య విరామాల్లో ప్రసారం చేసి ప్రేక్షకులను ఆకర్షించవచ్చు. అంతేకాదు ఈ రెండు నెలల్లో విడుదల చేయాలనుకునే మూవీస్ లో స్టోరీ కంటెంట్ ను కాస్తా మార్చాలి. జనాలలో క్రికెట్ కున్న క్రేజ్ ను క్యాష్ చేసుకోవడానికి స్పోర్ట్స్‌బేస్డ్ సినిమాలను నిర్మించి విడుదల చేయాలి.మాజీ క్రికెట్ సెలబ్రిటీలను ప్రచారాస్త్రంగా మలచుకోవాలి. మన దేశంలో క్రికెట్ అంటే ఒక మతం . ప్రత్యేకంగా ఐదేళ్లకోసారి జరిగే ప్రపంచకప్ కన్నా రెండేళ్ల కోసారి జరిగే టీ20 వరల్డ్ కప్ కన్నా ప్రతీ సంవత్సరం జరిగే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఎక్కువగా ప్రేక్షకులను ఆకర్షిస్తుంది.బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ ,మాలీవుడ్ అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాలలో క్రికెట్ లవర్స్ ఉన్నారు. అందుకే వరల్డ్ ఫేమస్ క్రికెటర్లతో హంగామాతో సంవత్సరానికి ఓసారి వచ్చే ఐపీఎల్ ను ఎక్కువగా మిస్ అవ్వరు. గతంలో ఐపీఎల్ సీజన్‌లో 20182023 మధ్య విడుదలైన కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో కలెక్షన్లు రాబట్టలేకపోయాయి.కొన్ని ప్రొడక్షన్ హౌసులు, డిస్ట్రిబ్యూటర్లు కొందరు నిర్మాతలు ఏప్రిల్‌మే నెలల్లో సినిమాలను విడుదల చేయకుండా వాయిదా వేసుకోవడం గమనిస్తున్నాం.పెద్ద సినిమాలను ఐపీఎల్ తర్వాత విడుదల చేయడం కారణంగా కేజీఎఫ్2,ఆర్ ఆర్ ఆర్ లాంటి బిగ్ బడ్జెట్ మూవీస్ భారీ హిట్ కొట్టాయి.ఐపీఎల్ సినిమాలకు పోటీ అయినా, దీన్ని అధిగమించడం నిర్మాతలకు దర్శకులకు ఒక సవాల్ లాంటిది.



- సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్



## ఎంజిఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆర్.యం.ఓ లు
- ఐ యన్ టీయూసి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం

**వరంగల్, మహా :** పబ్లిక్ హెల్త్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్( ఐ. యన్.టీ. యూ.సి 3194 వరంగల్ ఉమ్మడి జిల్లా చైర్మన్ బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో యం.జి.యం ఆసుపత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఆర్ ఎం ఓ 1, డిప్యూటీ సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఆర్ యం ఓ లుగా డా. అంబి శ్రీనివాస్ తో పాటు డా. శశికుమార్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వీరిని ఐ.ఎన్.టి.యూసి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బత్తిని సుదర్శన్ గౌడ్ మాట్లాడుచూ యం జి యం ఆసుపత్రి లో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగుల సమస్యలను వాటిని పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవాలని Aకోరగా ఆర్ యం ఓ లు సానుకూలంగా స్పందిస్తూ ఎంజిఎం లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ యన్ టీ యూ సి యం జి యం బ్రాంచ్ నాయకులు ప్రీతి సజిని, సాల్మ, నార్ల వేణు, సుజాత, సరలా రాణి, కొడిపాక కార్తీక్,సంజీత, రజని, అనీస్, సత్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి

### రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించిన ఏసిపి



**వరంగల్, మహా :** పండగలు సమీపిస్తున్న వేళ వరంగల్ నగరంలో శాంతి భద్రతల పై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సోమవారం వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ నగరంలోని రౌడీషీటర్ల కు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో ఏ పరిస్థితుల్లోనైనా శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ఎవరు వ్యవహరించిన వారి పై చర్యలు కఠిన తరంగా ఉంటాయని ఏసిపి హెచ్చరించారు. ముఖ్యంగా రౌడీ షీటర్స్ సత్ప్రవర్తనతో ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా ఉండాలని ఏసిపి నందిరాం నాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో మట్టెవాడ ఇన్స్పెక్టర్ తుమ్మ గోపిరెడ్డి, పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం చెరువుల పరిరక్షణకు జంగంగౌడ్ ముందుకు

- చెరువులలో అక్రమ నిర్మాణాల తొలగించాలి
- ఇరిగేషన్ డిఇ చెన్నకేశవ రెడ్డికి వినతిపత్రం



**రంగారెడ్డి జిల్లా, మహా :** ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామం చెరువులు, కుంటలు కాపాడేందుకు జిఎంజి ఫౌండేషన్ చైర్మన్ గుండ్ల జంగంగౌడ్ కీలక చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ డివిజనల్ ఇంజనీర్ చెన్నకేశవ రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. చెరువుల పరిరక్షణపై ప్రభుత్వ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, అక్రమ కట్టడాలను ధ్వంసం చేయాలని వినతి పత్రంలో కోరారు. ప్రకృతి రక్షణకు అడుగులు వేయాలని గుండ్ల జంగంగౌడ్ మాట్లాడుతూ, "చెరువులు, కుంటలు కాపాడితేనే భవిష్యత్‌లో నీటి సంక్షోభాన్ని నివారించగలమని, కొందరి స్వలాభం కోసం ప్రకృతిని నాశనం చేయడం తగదని అన్నారు. అక్రమంగా చెరువుల కట్టలను కబ్జా చేసి, ఎలాంటి అనుమతులు లేకుండా పౌల్ట్రీ ఫార్మ్‌లు నిర్మించడం చట్ట విరుద్ధం అన్నారు. అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలి" అని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందిస్తేనే పరిష్కారం ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఇటువంటి అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికులు కూడా కోరుతున్నారు. గుండ్ల జంగం గౌడ్ వినతిపత్రంతో సంబంధిత అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. జిఎంజి ఫౌండేషన్ తరఫున ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు కృషి కొనసాగిస్తామని తెలిపారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మహా :** ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం, జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా (66) అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఘనపూర్ (స్టేషన్) మండలం, స్థానికంగా నివాసం ఉంటున్న కె. రాజు రెవెన్యూ శాఖకు సంబంధించి తన రెండు ఎకరాల ఆరు గుంటల వ్యవసాయ భూమి పక్కన వాల్టా చట్టం 2004కు విరుద్ధంగా బోరు వేసి, తమ బోరును నడవకుండా చేసినందున వారిపై తగు చర్యలు తీసుకొనుట కొరకు దరఖాస్తు చేసుకున్నారు. శివునిపల్లి గ్రామం, ఘనపూర్ (స్టేషన్) మండలానికి చెందిన కటకం వెంకట శ్రీధర్, తన ఇరవై ఒక్క గుంటల భూమి నందు అక్రమ ఇంటి నిర్మాణాన్ని నిలుపుదల చేయుట గురించి దరఖాస్తు చేసియున్నారు. ఘనపూర్ (స్టేషన్)నియోజకవర్గం,స్థానికంగానివాసం ఉంటున్న చింతకుంట నరసింహారెడ్డి, తన నాలుగు గుంటల భూమి 2008లో ఘనపూర్ (స్టేషన్) లోని రిజర్వాయర్ లో భూసేకరణలో తీసుకోగా, ఇందుకు గాను రూ. 9,52,768 నష్ట పరిహారం వచ్చాయని, వాటిని తాను తీసుకోలేదని, ఆ డబ్బులను ఫార్మ్‌ఈ ద్వారా సరెండర్ చేశారని, కావున తన సమస్యను పరిష్కరించి డబ్బులను ఇప్పించుటకు ఆర్జీ ద్వారా కోరారు. నాగారం గ్రామం, లింగాల ఘనపురం మండలానికి చెందినకెమిడి రమేష్,తమపది గుంటలభూమికాలువ కింద కూలిపోవడం జరిగినందున ఎటువంటి నష్ట పరిహారం పొందలేదని, కావున నష్ట పరిహారం అందించగలరని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం సమర్పించనైనది. కోలుకొండ గ్రామం, దేవరుప్పుల మండలానికి చెందిన జూకంటి ఐలయ్య, తన 3.04 గుంటల భూమికి సంబంధించిన పట్టా పాసు బుక్కులు మంజూరు అయ్యాయని, వాటిని జారీ చేయుట కోరుతూ దరఖాస్తును సమర్పించినారు. అదే విధంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికై అన్ని మండలాల సంబంధిత తహసీల్దార్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి, అప్పటికప్పుడు దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మండలాల స్థాయిలో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, పెండింగ్ లో లేకుండా దరఖాస్తులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సరైన విధంగా నిర్వహించాలని, అందుకు తగ్గట్లుగా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఈ ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ఈ నెల 31 లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికాబద్ధంగా వేసవి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎంపిక చేసిన 12 గ్రామాల్లో మార్కింగ్ ను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డిప్యూటీ జెడ్పీ సిఈఓ సరిత, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం పై ఉక్కుపాదం మోపాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, మహా :** జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశపు హాలులో సోమవారం మాదకద్రవ్యాల జిల్లా నిరోధక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల రవాణా, వినియోగం పై అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలనీ, గంజాయి, డ్రగ్స్ రవాణా ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, హై వే ల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా గంజాయి, డ్రగ్స్ వినియోగం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ పంపిణీ చేసే పెడ్లర్స్ ను గుర్తించి వారిపై కఠిన కేసులు నమోదు చేయాలన్నారు. డ్రగ్స్ సరఫరా, వినియోగం కూడా శిక్షార్హమేనని, గంజాయి, డ్రగ్స్ వినియోగం కలిగే దుష్ప్రభావాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఏర్పాటుచేసిన 350 ప్రహరీ క్లబ్ ల ద్వారా విద్యార్థుల్లో గంజాయి, డ్రగ్స్ వినియోగం కలిగే దుష్ప్రభావాల పై చైతన్యం కల్పించాలని సూచించారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లోని, ప్రముఖ రోడ్ల కూడళ్లు టోల్ ఫ్రీ నంబర్ 1908 ప్రదర్శించాలన్నారు. పోలీస్,వైద్య, మెడికల్, అధికారులతో ప్రత్యేక బృందంగా ఏర్పాటుచేసి పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన శిక్షలు పై విస్తృత అవగాహనకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డిసిపి ఈస్ట్ జోన్ అంకిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, నాటు సారా అమ్మకాలు, రవాణాపై పెద్ద ఎత్తున నిఘా పెట్టామన్నారు. స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు జరగకుండా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 23 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఎం హెచ్ ఓ. సాంబశివ రావు, జిల్లా సంక్షేమ అధికారి రాజామణి, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, డి ఎస్ పి సైదులు, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, ఏసీపీలు కిరణ్ కుమార్, రవీందర్, రవాణా, పోలీస్, డ్రగ్స్, అటవీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, మహా :** ప్రజావాణి లో స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఆధనపు కలెక్టర్ సంధ్యారాణి డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు వరంగల్ సత్యపల్ రెడ్డి,నర్సంపేట ఉమరాణి లతో కలసి జిల్లా వ్యాప్తంగా ప్రజల నుండి పలు సమస్యలపై మొత్తం 85 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను మానవతా దృకృథంతో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా వాణిలో అధిక మొత్తం లో రెవెన్యూ శాఖ ,కలెక్టరేట్ కి సంబందించిన దరఖాస్తులు వచ్చాయి అవి రెవెన్యూ శాఖకు 20 కలెక్టరేట్ పరిపాలన విభాగానికి 14 రాగా మిగతా ఫిర్యాదులను వివిధ శాఖలకు సంబంధించిన పలుసమస్యల పై దరఖాస్తులు స్వికరించడమైనది. సీఎం ప్రజావాణి లో స్వీకరించి సంబంధిత శాఖల వారీగా పెండింగ్లో ఉన్న దరఖా స్తులను పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మండల ప్రత్యేక అధికారులతో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చేపడుతున్న చర్యలు, విద్యుత్ సరఫరా, తదితర అంశాలపై మండలాల వారీగా కులంకషంగా సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఈనెల 25 నుండి 27 వరకు మూడు రోజుల పాటు నిర్వహించ నున్న రాష్ట్ర స్థాయి రైతు ఉత్పత్తిదారుల సంఘం మేళలో సంబంధిత అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు . పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులు వివిధ శాఖల వారీగా 974 రాగా వాటిలో 65 మాత్రమే పరిష్కరించడం జరిగిందని మిగతా దరఖాస్తుల ను పరిష్కరించే విలున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించి, పరిష్కరించుటకూ వీలు లేని దరఖాస్తులను ఎందుకు పరిష్కరించ బడదో దరఖాస్తు దారుడికి వివరించే ప్రయత్నం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఆర్డీఓ కౌసల్య దేవి, ఆర్డీఓ లు , జిల్లా అధికారులు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## సీపీని కలసిన ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్



**హన్మకొండ, మహా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్ గా భాద్యతలు చేపట్టిన సన్ ప్రీత్ సింగ్ ను పబ్లిక్ ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ సంతోషినితో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ నేరానికి పాల్పడిన నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసి బాధితులకు న్యాయం అందించాలని తెలిపారు.సిపిని కలసిన వారిలో అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీధర్ రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవి కిరణ్, బృంద, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పావని,దుర్గ బాయి, వున్నారు.

## ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి

- బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే
- ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన కమిషనర్



**వరంగల్ మహా :** ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించి పరిష్కార నిమితం వివిధ విభాగాల ఉన్న తాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా 1.ఇంజనీరింగ్....16 , 2.హెల్త్ & సానిటేషన్.....15, 3.ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)..20, 4.టౌన్ ప్లానింగ్...45 ,5.మంచినీటి సరఫరా.....07, మొత్తం....103 గా అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర బయలజిస్ట్ మాధవ రెడ్డి సెక్రటరీ అలివేలు హెచ్ ఓ రమేష్ ఇన్చార్జి సి పి రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



## ముస్లిం లకు ఉచితంగా చీరలు, దుస్తుల పంపిణీ

**వరంగల్, మహా :** రంజాన్ పండుగ సందర్భంగా వరంగల్ ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ఎంఎస్ పాషా ఆధ్వర్యంలో ముస్లింలకు చీరలు దుస్తులు పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు విచ్చేసి ఆయన చేతుల మీదుగా మూడు వందల మంది ముస్లింలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలన పై అవగాహన ర్యాలీ

### థీమ్" YES..! WE CAN END TB






**వరంగల్ మహా :** ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరంగల్ డాక్టర్ సాంబశివరావు క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. వరంగల్ నగరంలోని హనుమాన్ జంక్షన్ నుండి డిఎంహెచ్ఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ ఆచార్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ అర్చన, ప్రోగ్రాం ఆఫీసర్ విజయ్ కుమార్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్,ఆశా కార్యకర్తలు, ఏ ఎన్ ఎం క్షయ వ్యాధి నిర్మూలన ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం టిబి థీమ్ Yes..! We Can End TB క్షయ వ్యాధి ఒక అంటూ వ్యాధి ప్రతి ఒక్కరూ చేయ వ్యాధిగ్రస్తులకు దూరంగా ఉండి వారి నుండి రక్షణ పొందాలని కోరినారు చేయవ్యాధి తగిన సమయంలో గుర్తించి నట్లయితే దానికి తగిన చికిత్సలు వైద్యాధికారుల ద్వారా తీసుకోవాలని ప్రజలను కోరినారు క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్స సమయంలో ప్రతినెల 1000 రూపాయలు పోషణ అభయాని కింద అందించడము జరుగుతుందని తెలిపినారు.క్షయ వ్యాధి నిర్మూలించాలని ఇందుకోసం ప్రతి ఒక్క వైద్య సిబ్బంది కృషి చేయాలని అన్నారు. డాక్టర్ ఆచార్య మాట్లాడుతూ గత సంవత్సరం 1430 టీబీ కేసులు నమోదు అయ్యాయి. ప్రస్తుత సంవత్సరం ఇప్పటి వరకు 276 కేసులు నమోదు అయ్యాయి. ప్రజలలో అవగాహన పెరగటం వలన క్షయవ్యాధి తగ్గుముఖము పడుతున్నది ఈ విధంగానే అందరము ప్రయత్నం చేస్తే జిల్లాను క్షయ వ్యాధి లేని జిల్లాగా మార్చవచ్చునని కోరినారు. వీరికి సరైన సమయంలో మెడిసిన్స్, ఇతర ప్రయోజనాలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు , డిప్యూటీ డిఎండిహెచ్వో డాక్టర్ ప్రకాష్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆచార్య , డాక్టర్ అర్చన డాక్టర్ విజయకుమార్ ఫిజియో తెరపిస్ట్ డాక్టర్ నరసింహారెడ్డి పాటు డిపిఓ అర్చన క్షయ నియంత్రణ సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తల తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## సీపీని కలసిన ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్

**హన్మకొండ, మహా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్ గా భాద్యతలు చేపట్టిన సన్ ప్రీత్ సింగ్ ను పబ్లిక్ ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ సంతోషినితో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ నేరానికి పాల్పడిన నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసి బాధితులకు న్యాయం అందించాలని తెలిపారు.సిపిని కలసిన వారిలో అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీధర్ రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవి కిరణ్, బృంద, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పావని,దుర్గ బాయి, వున్నారు.

## నోటీసులు ఇచ్చిన ఆస్తి పన్ను కట్టని ప్రపర్టీలు ఇకపై సీజింగే నగారా కమిషనర్ చాహత్ భాజ్ పాయ్



**కరీంనగర్, మహా:** నోటీసులు ఇచ్చిన స్పందించకుండా నగరపాలక సంస్థ ఆస్తి పన్నులు చెల్లించని బకాయిదారుల ప్రాపర్టీలను సీజ్ చేస్తున్నట్లు కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ అన్నారు. కరీంనగర్ నగరంలో సోమవారం రోజు రెవెన్యూ విభాగం అధికారులు నగరపాలక సంస్థకు ఆస్తి పన్ను చెల్లించకుండా బకాయి ఉన్న రాంనగర్ ప్రాంతంలోని లిటిల్ పార్కుతో పాటు వెంకట సాయి సినిమా థియేటర్, లేడీస్ ఎంపోరియం ప్రాపర్టీలను సీజ్ చేసి... నగరపాలక సంస్థ బ్యానర్ ను ఏర్పాటు చేశారు. గత కొంత కాలంగా నగరపాలక సంస్థ కు పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను బకాయి ఉండటంతో పన్నులు చెల్లించాలని నోటీసులు జారీ చేసిన స్పందిచక పోవడంతో ప్రాపర్టీలను సీజ్ చేశారు. ఆస్తి పన్నుల చెల్లింపు గడువు దగ్గర పడుతుండటంతో మొండి బకాయి దారుల పై నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు ఒత్తిడి పెంచారు. పన్నులు చెల్లించని మొండి బకాయి దారుల కు నోటీసులు జారీ చేసి నోటీసులు ఇచ్చిన గడువు ముగియడంతో ప్రాపర్టీల సీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ... నగరపాలక సంస్థ కు చెల్లించాల్సిన ఆస్తి బకాయిలను సకాలంలో చెల్లించి కరీంనగర్ అభివృద్ధి సహాకరించాలని పిలుపు నిచ్చారు. ముఖ్యంగా మొండి బకాయి దారులు మీ యొక్క ఆస్తి పన్నులను చెల్లించాలి... చెల్లించని యడల నోటీసులు జారీ చేసి సంబంధిత ప్రాప్రర్టీలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ అధికారులకు పురపాలక శాఖ చట్టం ప్రకారం అన్ని రకాల ఆదేశాలను జారీ చేశామని తెలిపారు.

## మహిళకు త్రృటిలో తప్పిన ప్రమాదం



**మహబూబాబాద్, మహా :** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పట్టణ కేంద్రంలో చిరు వ్యాపారం చెరుకు మిషన్ నిర్వహిస్తున్న ఓ మహిళకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. చెరుకును పెట్టే క్రమంలో చెరుకు మిషన్ లో మహిళా జుట్టు ఇరుక్కుపోగా స్థానికులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి మహిళను కాపాడటంతో ప్రమాదం తప్పింది. ప్రమాదంలో మహిళ చేతికి గాయాలు కాగా సమయానికి విద్యుత్ సరఫరా నిలిపియడంతో మహిళ ప్రాణానికి ప్రమాదం తప్పడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

**వరంగల్, మహా :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 24 వ డివిజన్ లో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతాలకతీతంగా ఇతరులు కూడా ఇఫ్తార్ విందులో పాల్గొనడం సోదరాభావాన్ని పెంచి లౌకిక విలువలను కాపాడుతాయని, ముస్లిం సోదరులు నెలరోజుల పాటు అత్యంత కఠిన నియమాలతో అల్లాను ప్రార్థిస్తారని, అల్లా దయతో ప్రజలందరు సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు ఖర్జూరం తినిపించి ఉపవాసన్ని విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు,మైనారిటీ సోదరులు మాజీ ప్రజా ప్రతినిధులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్ఏ వారసుల ను ముందస్తు అరెస్టులు




**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో 61 సంవత్సరాల పైబడిన వీఆర్ఏల వారసులకు జీవో 81, 85 ప్రకారం ఉద్యోగాలు కల్పించాలని, డిమాండ్ చేస్తూ, వీఆర్ఏ వారసులు, ఇంద్ర పార్క్ వద్ద శాంతియుత ధర్నాకు సిద్ధమయ్యారు. అయితే, మోత్కూరు మండలానికి చెందిన వీఆర్ఏ వారసులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో జక్కుల ఎల్లయ్య, బత్తిని రవి కిషోర్, గొడుగు మచ్చ గిరి, అంబటి ఎల్లేష్ తదితరులు, ఉన్నారు. వీఆర్ఏలు వృద్ధాప్యం లోకి చేరుకున్న తర్వాత వారి వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, జీవో 81, 85 అమలు చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై స్థానిక వీఆర్ఏ కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

# ములుగు జీపీలో ఇష్టారాజ్యం..!

- నోటీసు ఇవ్వకుండానే షాపులకు వేలం
- మూడు షాపులకు రూ.2లక్షలపైనే బకాయిలు
- జీపీలో పాత పాలకవర్గం ఆధిపత్యం
- పట్టించుకోని స్పెషల్ ఆఫీసర్



**ములుగు, మహా :** ములుగు మేజర్ గ్రామపంచాయతీలో గత పాలకవర్గం ఆధిపత్యం కొనసాగుతోంది.. అనధికార ఆర్డర్లతో పొరుగు జీపీ పరిధిలోని వారికి ఉపాధి కల్పిస్తున్నారు. గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చే కమేళా, తైబజార్ లకు పబ్లిక్ సమాచారం లేకుండానే వేలం వేశారు. అదేవిధంగా ములుగులోని గాంధీ విగ్రహం ఆనుకొని ఉన్న ఐదు షాపులకు సైతం వేలం వేయడంలోనూ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులో మూడు షాపులకు సంబంధించి ఒక్కో షాపు వారు సుమారు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. సర్పంచ్ ల కాలం పూర్తయిన నేపథ్యంలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండగా ములుగులో మాత్రం ఆవిధానం కనిపించడంలేదు.

**20ఏళ్లుగా జీపీకి చెందిన షాపులకు లేని వేలం**

ములుగులో గాంధీ విగ్రహం వద్ద గల జీపీకి సంబంధించిన ఐదు షాపులకు సుమారు 20ఏళ్ల నుంచి వేలం వేయలేదు. ఈ ఏడాది ఈనెల 22న మొదటిసారి వేలం వేయగా అందుకు సంబంధించిన నోటీసు ప్రజలకు ఇవ్వలేదనే ఆరోపణలున్నాయి. వేలంలో అన్ని షాపులకు ఒకే విధానంలో వేలం వేయాల్సి ఉండగా మూడు షాపులకు వేలం వేసి రెండు షాపులకు వేలం వేయలేదు. గతంలో నిర్వహించే యజమానులకే షాపులను కట్టబెట్టారు. ఈ విధానంపై పంచాయతీ ఆఫీసర్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదు షాపుల్లోని మూడు దుకాణాలకు ఒక్కో షాపు రూ.3లక్షల లోపు కిరాయిలు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. అయితే ఈ షాపుల వేలానికి సంబంధించి పబ్లిక్ నోటీసు ఇవ్వాల్సిన పంచాయతీ అధికారులు కేవలం ఒక పేపరుకు చిన్నపాటి యాడ్ ఇచ్చి వదిలేశారు. పౌర సమాచార శాఖ ద్వారా ప్రజలకు వేలంకు సంబంధించిన సమాచారం ఇవ్వాల్సి ఉన్న జీపీ అధికారులు అందుకు విరుద్ధంగా నడుచుకున్నట్లు తెలుస్తోంది. ఈ వేలంపాటకు గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ హాజరు కావాల్సి ఉన్న కేవలం డీపీవో, ఎంపీవో, ఈవోల ఆధ్వర్యంలోనే తూతూ మంత్రంగా వ్యవహరించారు. అదేవిధంగా ఐదు షాపుల వేలంకు సంబంధించి షాపుల యజమానులకు సైతం సమాచారం ఇవ్వకపోవడం దారుణం.

**పంచాయతీ ఆఫీసర్లపై పాత పాలకవర్గం ఆధిపత్యం**

ములుగు గ్రామపంచాయతీలో పొరుగు జీపీకి చెందిన వారిని ఉద్యోగులుగా చేర్చుకుంటున్నారని, పాత పాలకవర్గంలోని కొందరు జీపీ అధికారులపై ఆధిపత్యం చెలాయిస్తూ తమకు అనుకూలమైన వారికి జీపీలో ఉద్యోగ అవకాశాలు ఇప్పిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సర్పంచ్ ల కాలం ముగిసినా ఇప్పటికీ కొందరు తమ పెత్తనం చెలాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పన్నుల వసూళ్లు, ఇంటి నిర్మాణాలకు అనుమతులు, సంత నిర్వహణ, జీపీ పరిధిలో చేపట్టే ప్రతీ పనికి గత పాలకవర్గ ప్రతినిధులు తమ ఆధిపత్యం ఉండేలా హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు జీపీ ఉద్యోగులను, శానిటేషన్ సిబ్బందిని తమ వ్యక్తిగత అవసరాలకు ఇప్పటికీ ఉపయోగించుకుంటున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**ఎన్హెచ్ ప్లాట్ ఫాం ఆక్రమణలపై చర్యలేవి.?**

ములుగులోని జాతీయ రహదారికి ఇరువైపుల బాటసారులు నడిచేందుకు జీపీ అధికారులు ఒక్కరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కొందరు ఏర్పాటు చేసుకున్న బోర్డులు, సామాగ్రిని ట్రాక్టర్లో వేసుకొని వెళ్లారు. తిరిగి అవే బోర్డులు ములుగులో ప్రత్యక్షమవుతున్నాయి. మసీదు, బస్టాండ్, ఏరియా ఆస్పత్రి సమీపంలో ప్లాట్ ఫాంలు వ్యాపార అడ్డాలుగా మారుతున్నాయి. కొందరు మాత్రం బోర్డులను అడ్డంగా పెడుతూ బాటసారులు నడిచేందుకు వీలు లేకుండా వ్యవహరిస్తున్నారు. ఇదేమని అడిగితే ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండంటూ తేల్చి చెబుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు జీపీ అధికారులకు విన్నవించినా ఒక్కరోజు మురిపంగా రైడ్ నిర్వహించి వదిలేశారనే విమర్శలున్నాయి.

## గ్రీవెన్స్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ (రెవిన్యూ) సీహెచ్.మహేందర్ జీ**



**ములుగు, మహా :** ప్రజావాణిలో ఫిర్యాదు చేసే దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) సిహెచ్.మహేందర్ జీ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్ లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రీవెన్స్ లో మొత్తం 27దరఖాస్తులు రాగా అందులో 8 రెవెన్యూ భూ సమస్యలు, 19ఇతర శాఖలకు సంబంధించి వచ్చాయి. ఈ సందర్భంగా మహేందర్ జీ మాట్లాడుతూ.. ప్రజల దరఖాస్తులు సత్వరమే పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుకు సంబంధించిన పురోగతిని దరఖాస్తు దారునికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు. గ్రీవెన్స్ లో తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రాంచందర్ రావు భూసమస్యలపై వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం మండల కేంద్రంలో సర్వేనెం.69,4/1 గల ప్రభుత్వ భూమిని రెవెన్యూ ఉద్యోగి కబ్జా చేశాడని ఆరోపించారు. గతంలో పలుమార్లు పిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు సమగ్రమైన విచారణ జరిపి అక్రమ పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘం వెంకటాపురం మండల అధ్యక్షులు తాటి లక్ష్మణరావు, పూనెం పవన్ కుమార్, పోడెం రాజేష్, కోరం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా లక్నవరం ముంపు గ్రామాలకు ఎస్సారెస్పీ సాగునీరు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ములుగు మండలంలోని లక్నవరం ముంపు గ్రామాలైన రాయినిగూడెం, పంచాయత్కలపల్లి, కొత్తూరు, దుబ్బగూడం, పెగడపల్లి, లాలయగూడెం, జగ్గన్నగూడెం, అంకన్న గూడెం, సర్వాపూర్, ఖన్నాయిగూడెం గ్రామాలకు ఎస్సారెస్పీ సాగునీరు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజాద్ పాషా కోరారు. లోతట్టు గ్రామాలలో సుమారు 4వేల ఎకరాల్లో వరి, మొక్క జొన్న పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు తవిటి నారాయణ, మంకిడి కృష్ణ, ఆగబోయిన సాంబయ్య, గొంది సాంబయ్య, పోతయ్య, పాపయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలనాగమ్మ నాటకం పోస్టర్ల ఆవిష్కరణ



**హుజూర్ నగర్, మహా:** మఠంపల్లి మండల కేంద్రం లోని బొడ్రాయి సెంటర్ వద్ద ఉగాది పర్వ దినం పురస్కరించుకొని స్థానిక ఆగ్నేష్ అమ్మ, బాలశౌరయ్య నాట్య కళామండలి జ్యోతి ప్రకాష్ యోజన నాట్య కళామండలి సంయుక్తంగా ఈ నెల 28న రాత్రి 8 గంటలకు అలనాటి చారిత్రక జానపద పద్య నాటకం బాలనాగమ్మ నాటకం కరపత్రాలను నియోజకవర్గ కళాకారుల సంఘం అధ్యక్షులు భువనగిరి ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాష్ బాబు మాట్లాడుతూ మఠంపల్లి బొడ్రాయి సెంటర్లో సుమారు 50 సంవత్సరాల తర్వాత ఆంధ్ర ,తెలంగాణ సీనియర్ కళాకారుల మేల వెంపుతో ఈ నాటకం ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు కళాకారులు కళాభిమానులు తరలివచ్చి నాటకాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రంగస్థలం కళాకారులు థామస్ రెడ్డి, బివి రామారావు, జూలు వెంకటేశ్వర్లు, జాల కిరణ్, మల్లెబోయిన గోపయ్య, షేక్ ఖాసిం, భువనగిరి జోసు, ధర్మయ్య గౌడ్, జయభారత్ రెడ్డి, ఎస్ కే సైదులు, నాగ బ్రహ్మచారి, వంగవీటి నాగేశ్వరరావు,నాగరాజు, బాణోతూ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ





- త్వరగతిన ఫిర్యాదుల పరిష్కారం చేయాలి
- దరఖాస్తులను కాలయాపన చేయరాదు
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్
- ఉన్నత విద్యాధికారులతో సమీక్షా
- ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలి

**రంగారెడ్డి జిల్లా, మహా:** సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 56ఫిర్యాదులు అందాయి. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**విద్యాధికారులతో సమీక్షా**

ఉన్నత విద్యాధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ సి నారాయణ రెడ్డి, పదవ తరగతి పరీక్షలు ముగిసిన అనంతరం హాస్టల్స్, సంక్షేమ వసతి గృహాలలో ఉండే పిల్లలను జాగ్రత్తగా వారి ఇండ్లకు పంపించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యా శాఖ మరియు జిల్లా ఇంటర్మీడియట్ అధికారులకు సూచించారు.

**గ్రామాలలో ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలి**

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని పిడి హౌసింగ్ అధికారులకు తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా సమీక్షించాలి... గ్రామాలలో, మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి కొరత ఏర్పడకుండా చూడాలని డీపీఓకు, మున్సిపల్ కమిషనర్లకు, మిషన్ భగీరథ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. సోమవారం ప్రజావాణి లో ఫిర్యాదులు రెవెన్యూ శాఖ 25, ఇతర శాఖలకు 36, మొత్తం 56 ఫిర్యాదులు అందాయి.

# బల్దియాలో బిల్లుల భాగోతం

- బిల్లుల మంజూరులో కమిషన్ల కక్కుర్తి అధికారుల ఇస్తారాజ్యం
- చెల్లింపులో తూర్పు నియోజకవర్గానికి మొండి చేయి
- కమీషన్లు ఇస్తేనే బిల్లులు చెల్లిస్తారా?
- పర్సంటేజి ఇచ్చి నచ్చిన వాళ్ళకే పదే పదే చెక్కులా?

**వరంగల్, మహా :** జీడబ్ల్యూఎంసీలో ఎప్పుడూ లేని విధంగా బిల్లుల మంజూరులో పర్సంటేజీల హావా కొనసాగుతోంది. ముఖ్యంగా బిల్లుల చెల్లింపుల్లో తూర్పు పశ్చిమ నియోజకవర్గాల వారీగా పక్షపాతం చూపించారు. ఇందులో తూర్పు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు పూర్తి చేసిన గుత్తేదారులకు క్షేత్ర స్థాయిలో బిల్లుల మంజూరు చేయలేదని కొందరు కాంట్రాక్టర్లు విమర్శిస్తున్నారు. కాగా ఉన్నతాధికారి క్యాంపు ఆఫీసులోనే కొంతమంది కాంట్రాక్టర్లు వచ్చి కమీషన్ల పై చర్చలు జరుపుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. జీడబ్ల్యూఎంసీతో సంబంధం లేని ఓ ప్రైవేట్ వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ప్రైవేట్ వ్యక్తి ముందుగా కాంట్రాక్టర్లను కలిసి చర్చలు జరిపి తర్వాతే బిల్లుల మంజూరు చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారి, పనులు పరిధిలోని అధికారుల మధ్య ఒప్పందం మేరకు కమీషన్లు ముట్టిన తర్వాత సదరు వ్యక్తి సూచన మేరకే బిల్లుల చెల్లింపులు జరుగుతున్నట్లు తెలిసింది. బిల్లులు చెల్లించే జాబితాలోని కాంట్రాక్టర్లను ప్రైవేట్ వ్యక్తి ఎమ్మెల్యే వద్దకు పంపించి ఫలనా వారి బిల్లులు చెల్లించాలని జీడబ్ల్యూఎంసీ ఉన్నతాధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. తర్వాత అకౌంట్ విభాగంలో చెల్లింపులు వేగంగా జరుగుతున్నది. ప్రైవేట్ వ్యక్తితో ఒప్పందం ఉన్న కాంట్రాక్టర్లకు వెంటనే చెక్కులు రాసి ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో వసూళ్ల దందా నడుస్తున్నట్లు తెలిసింది. ఏండ్లుగా ఇదే సెక్షన్లో పని చేస్తున్న ఓ అధికారి ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడుతు న్నట్లు ఆరోపణలు వ్యక్త మవుతున్నాయి. బిల్లు లోని మొత్తాన్ని బట్టి చెల్లింపు సమయంలోనే వాటా నిర్ణయించి వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. అకౌంట్ సెక్షన్లోని ఆ అధికారిని ముందుగా కలిసిన వారికి.. ఫోన్లు చేసి మరీ బిల్లుల చెక్కులను అందజేస్తున్నారు. ఫలానా రోజు, ఫలానా సమయానికి వచ్చి చెక్కు తీసుకోవాలని చెబుతున్నారని తెలిసింది. గ్రేటర్ బిల్లుల చెల్లింపులో అవినీతి రాజ్యమేలుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాని నిధులు ఆ ఆర్థిక సంవత్సరం చివరలో పన్నుల వసూలు పన్నుల నిధులతో వరుసగా బిల్లుల చెల్లింపులు ఆ వారంలోనే కాంట్రాక్టర్లకు రూ.10 కోట్లు ఓ ఎమ్మెల్యే చెప్పిన వారికి ఏకంగా రూ.8 కోట్లు మంజూరు చేశారనే ఆరోపణలు రావడం గతంలో మంజూరైన పనులకు బిల్లులు చెల్లించడం లేదనే విమర్శలు ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇదే పరిస్థితి ఉన్నది. నిధుల మంజూరు లేకపోవడంతో వరంగల్ నగరంలో అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయి. గతంలో మంజూరైన పనులు చేసిన వారి పరిస్థితి అయోమయ గోచరంగా ఉన్నది. వారంలో ఆర్థిక సంవత్సరం ముగియనున్నది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్లు లో ఆకతవకలు కమిషనర్ తీరుపై కొందరు కాంట్రాక్టర్ల అసంతృప్తితో మంత్రికి, ఆమె భర్తకు ఫిర్యాదు చేశారు. జిడబ్ల్యూఎం సి ఉన్నతాధికారి క్యాంప్ ఆఫీసులోని ఓ అధికారి ముందుగానే కొందరు కాంట్రాక్టర్లతో ఒప్పందాలు కుదుర్చుకొని, వారిని ఎమ్మెల్యే వద్దకు పంపి బిల్లులు చెల్లించేలా ప్లాన్ వేసారని ఆరోపణలున్నాయి. అభివృద్ధి పనులు చేసిన తేదీల ఆధారంగా కాకుండా కమీషన్ల ప్రాతిపదికన బిల్లుల చెల్లింపులపై మిగిలిన కాంట్రాక్టర్లు మేయర్ కు ఫిర్యాదు చేశారు. ఫలితం లేకపోవడంతో మంత్రికి, ఆమె భర్తకు ఫిర్యాదు చేశారని

కొందరు కాంట్రాక్టర్లు శనివారం రాత్రి మంత్రి భర్తను కలిసి బిల్లుల చెల్లింపుల దందా గురించి వివరించినట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాల నుండి మంత్రి రాగానే ఆమెకు ఫిర్యాదు చేయడానికి వీరంతా సిద్ధమయ్యారు. రోజువారీగా పోగైన నిధులను జిడబ్ల్యు ఎంసీ తక్కువ బడ్జెట్తో పూర్తయిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి పనుల బిల్లుల చెల్లింపులు చేస్తున్నది. ఈ చెల్లింపుల్లో కూడా జిడబ్లూఎంసీలోని ఉన్నతాధికారులు కమిషన్ల దందా మొదలు పెట్టారు. తేదీల పరంగా పెండింగ్ బిల్లులు చెల్లించకుండా కమీషన్లు ఇచ్చిన వారి బిల్లులనే ఓకే చేస్తున్నారు..




**గణాంక విభాగంలో బిల్లులకు పర్సంటేజీలు ప్రశ్నించిన కొందరు గుత్తేదారులు..మంత్రికి ఫిర్యాదు**

అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల్లో వరుస క్రమం పాటించరా? ఇదేమి పద్ధతి అని వరంగల్ ప్రాంతానికి చెందిన సివిల్ గుత్తేదారులు గ్రేటర్ వరంగల్ గణాంక విభాగం అధికారులను నిలదీశారు. తాజాగా అకౌంట్స్ విభాగంలో బిల్లుల చెల్లింపుల పై గంట న్నరపాటు వాగ్వాదం జరిగింది. విభాగం అధికారుల తీరుపై గుత్తేదారులు నిరసన తెలిపారు. కొంతమందికే బిల్లులు ఇస్తారా? మేం పనులు చేయలేదా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. 45 శాతం పర్సంటేజీలు ముట్టజెప్పిన వారికి గుట్టు చప్పుడు కాకుండా చెక్కులు రాస్తున్నారని ఆరోపించారు. కొన్ని నెలలుగా ఓ ఉన్నతాధికారి పేరు చెప్పి ప్రైవేటు వ్యక్తి కమీషన్లు వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల్లో బల్దియా అధికారులు వసూళ్ల దందాపై వరంగల్ ప్రాంతానికి చెందిన సివిల్ గుత్తేదారులు మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేసిన గుత్తేదారులకు బిల్లులు కూడా ఇవ్వడం లేదని విశ్వసనీయ సమాచారం.

# రైతులకు యాంత్రీకరణ సాయం

**ఎస్సీ ఎస్టీ మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు**

**కాటారం , మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు రైతులకు 40 శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు కోసం 155 యూనిట్ లకై రూ 38 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. వ్యవసాయ శాఖ మహాదేవపూర్ సబ్ డివిజన్ కు 66 వస్తాయ పరికరాల కోసం రూ 14.48 లక్షలు భూపాలపల్లి సబ్ డివిజన్ కు 89 వ్యవసాయ ఆధునిక పరికరాల కోసం రూ 24.03 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. వ్యవసాయ యాంత్రికరణ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి 30వ తేదీ లోపు రైతుల కు 40 శాతం రాయితీపై ఇవ్వనున్నారు. గ్రామాలలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన మహిళ రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. సబ్సిడీ వర్తించే యాంత్రికరణ పనిముట్లు వ్యవసాయ యాంత్రీకరణ పథకం లో భాగంగా జిల్లాకు ఒక ట్రాక్టర్ యూనిట్, 1 డ్రోన్ పరికరం, పవర్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు,రోటోవేటర్, బుష్ కట్టర్, కల్టివేటర్, పవర్ టిల్లర్, నాగళ్ళు ఈ పరికరాలకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ సమకూరుస్తుండగా, మిగతా మొత్తం డబ్బులు రైతులే చెల్లించాలి. 2018 నుండి 2023 వరకు అప్పటి ప్రభుత్వం రైతులకు జాంత్రీకరణ కోసం ఎలాంటి నిధులు ఇవ్వకపోవడంతో రైతులు పడే ఇబ్బందిని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే కూలీలు ఉన్న ప్రస్తుత సమయంలో యాంత్రికరణ పథకాన్ని అమలు చేయడమే మంచిదని ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని అమలు చేసేందుకు సబ్ డివిజన్ కేంద్రాల్లో వ్యవసాయ శాఖ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి త్వరితగతిన ఈ రాయితీ పథకాన్ని అర్హులైన రైతులకు వర్తింప చేస్తే ప్రభుత్వ ఉద్దేశం నెరవేరుతుంది.

## రేషన్ బియ్యం పట్టివేత




**అదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న 290 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.బియ్యం అక్రమ రవాణా పై ముందస్తు సమాచారం మేరకు ఇచ్చోడ మండలం జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా నిర్మల్ నుండి మహారాష్ట్ర వైపు వెళ్తున్న లారీలో 290 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. లారీ తో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

## ప్రభుత్వాలు మారిన మా బతుకులు మారతలే

- రాజేంద్రనగర్ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది
- నిత్యవసరాలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి



**రంగారెడ్డి జిల్లా, మహా:** రాజేంద్రనగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికుల ధర్నా చేపట్టారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాన్ని పెంచలంటూ ఆందోళనలు చేశారు. ప్రభుత్వాలు మారిన మా బతుకులు మారతలే, తమను పట్టించుకునే నాధుడే కరువాయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, మున్సిపాలిటీ కార్మికుల వేతనాలు పెంపుపై ఇక నైనా రేవంత్ ప్రభుత్వం తమపై దృష్టి సారించాలని, ప్రస్తుతం పెరుగుతున్న ధరలతో కుటుంబ పోషణ భారంగా మారిందని, నిత్యవసరాలకు అనుగుణంగా కనీస వేతనాన్ని 26000కు పెంచాలని డిమాండ్ చేశారు.

### సబ్ రిజిస్టార్ కార్యాలయలలో డాక్యుమెంట్ సెంటర్లలో

# ధరల పట్టికలు ఏర్పాటు చెయ్యాలి

- అవినీతికి పాల్పడే అధికారులను సస్పెండ్ చేయాలి
- ప్రభుత్వ ఫీజుకు మించి వసూళ్లకు పాల్పడే డాక్యుమెంట్ రైటర్ల లైసెన్సులు రద్దు చేయాలి




**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రం యాదాద్రి భువనగిరి జిల్లా లోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ లకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికలు ప్రజలకు తెలిసేలా కార్యాలయాలలో, డాక్యుమెంట్ సెంటర్లలో బోర్డులు ఏర్పాటు చేయాలని, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి, గుండు వెంకటనర్సు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మోత్కూర్ లో పత్రికా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. మోత్కూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధిక వసూళ్లకు పాల్పడుతున్న అధికారులపై, డాక్యుమెంట్ రైటర్లపై విచారణ జరిపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ధరల పట్టికలు లేకపోవడంతో డాక్యుమెంట్ రైటర్లు, కార్యాలయ సిబ్బంది కుమ్మక్కై ప్రభుత్వానికి చెల్లించ వలసిన రుసుం కంటే ఎక్కువగా ప్రజల వద్ద వసూలు చేస్తూ తమ ఇష్టానుసారంగా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడే కార్యాలయ సిబ్బందిపై, వారికి సహకరించే డాక్యుమెంట్ రైటర్ల పై, అవినీతి నిరోధక శాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తే కార్యాలయాల్లో అవినీతికి చెక్ పడే అవకాశం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వేలాది రూపాయలు వేతనాలు తీసుకునే ప్రభుత్వ ఉద్యోగులు తమ వృత్తిలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ సామాన్య ప్రజానీకం నుండి లంచాలు తీసుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు, కురిమేటి యాదయ్య, మెతుకు అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా, మహా :** రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత మత సమరయస్యానికి ప్రతీక అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మంచాల మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్, మహ్మద్ బురాన్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... పవిత్ర రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు ఎంతో భక్తి శ్రద్ధలతో పాటిస్తారని, అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికీ ఉండాలని కోరారు. మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థన నిర్వహించిన.. అనంతరం ముస్లిం సోదరులకు ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచాల మండల మాజీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ సలాం ఆజాద్, చీదేడు మాజీ సర్పంచ్ బైరిక రమాకాంత్ రెడ్డి, గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేష్, ఎన్నిదుల సురేష్, మహ్మద్ ఇమ్రాన్, అజీమ్, గఫార్, ఇర్ఫాన్, పాండాల శ్రీనివాస్, దూసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# 5జీ విస్తరణపై నోకియా నివేదిక



దేశంలో వివిధ టెలికాం సంస్థలు 5జీ నెట్‌వర్క్ పరిధిని విస్తరిస్తున్నాయి. ఇందుకోసం అవసరమయ్యే మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇటీవల విడుదలైన 'నోకియా 2024 మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ఇండెక్స్ రిపోర్ట్' దేశీయ 5జీ నెట్‌వర్క్ విస్తరణను విశ్లేషించింది. దేశవ్యాప్తంగా మెరుగవుతున్న టెలికాం కనెక్టివిటీని ఈ నివేదిక హైలైట్ చేసింది. అందులోకి కీలక అంశాలు కింది విధంగా ఉన్నాయి.

**పెరుగుతున్న 5జీ వినియోగం**

2024లోనే 5జీ డేటా ట్రాఫిక్ మూడు రెట్లు పెరగడం గమనార్హం. మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ వాడకంలో 5జీ నెట్‌వర్క్ ప్రస్తుతం 43% వాటాను కలిగి ఉంది. 2023 నుంచి ఈ వాటా దాదాపు రెట్టింపు అయింది. 2024లో ప్రతి వినియోగదారుడి సగటు నెలవారీ డేటా వినియోగం 27.5 జీబీకి చేరుకుంది. గత ఐదేళ్లలో 19.5% సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) చొప్పున ఈ వినియోగం పెరిగింది. స్మార్ట్‌ఫోన్లు పెరగడం, మెరుగైన ఇంటర్నెట్ సేవలు, డిజిటల్ కంటెంట్ వ్యాప్తి ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయి.

**నెట్‌వర్క్ వ్యవస్థ విస్తరణ**

దేశంలో 5జీ ఎకోసిస్టమ్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. అందుకు కావాల్సిన పరికరాలు, మౌలిక సదుపాయాలు రెట్టింపు అవుతున్నాయి. 2025 నాటికి దేశంలో దాదాపు 90% స్మార్ట్‌ఫోన్లు 5జీ సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని అంచనా. దేశంలో యాక్టివ్ 5జీ డివైజ్‌ల సంఖ్య 2024 నాటికి రెట్టింపై 271 మిలియన్లకు చేరుకుంది. తదుపరితరం వినియోగదారులు అధునాతన కనెక్టివిటీ కోసం సిద్ధంగా ఉంటారని ఇది నిర్ధారిస్తుంది.

**ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ ప్రభావం**

హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించడంలో ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఎఫ్‌డబ్ల్యూఏ) టెక్నాలజీకి పెరుగుతున్న ఆదరణను ఈ నివేదిక ఎత్తిచూపింది. 5జీ ఎఫ్‌డబ్ల్యూఏ వినియోగదారులు సగటు మొబైల్ వినియోగదారుల కంటే 12 రెట్లు ఎక్కువ డేటాను వినియోగించారు. ఇది వెనుకబడిన ప్రాంతాల్లో కనెక్టివిటీ సవాళ్లను పరిష్కరించే సామర్థ్యాన్ని నొక్కి చెబుతుంది. మొత్తం 5జీ డేటా ట్రాఫిక్ 2026 ప్రారంభం నాటికి ప్రస్తుత 4జీ ట్రాఫిక్‌ను మించిపోతుందని నివేదిక అంచనా వేసింది.

## ఒక్కరోజులో 1000 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

దేశీయ స్టాక్‌మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. మార్కెట్లు ముగిసే సమయానికి నిఫ్టీ 307 పాయింట్లు లాభపడి 23,658 వద్దకు చేరింది. సెన్సెక్స్ 1078 పాయింట్లు ఎగబాకి 77,984 వద్దకు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎన్‌టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, రియలన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతీ సుజుకీ, టీసీఎస్, టాటా మోటార్స్, ఐటీసీ స్టాక్‌లు లాభాల్లో ముగిశాయి. టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో, ఎం అండ్ ఎం, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా స్టాక్‌లు నష్టపోయాయి. యూఎస్ టారిఫ్ వార్తలు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు లేదా అమ్మకాలతోపాటు.. డాలరు ఇండెక్స్, ముడిచమురు ధరల కదలికలపై ఈ వారం ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నారు. గత వారం అమ్మకాల బాట వీడి విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులకు దిగారు. అయితే దేశీ ఫండ్స్ విక్రయాలవైపు చూపు సారించాయి. ఇటీవల ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు కొంతమేర బలహీనపడింది. ఈ నేపథ్యంలో గత వారం మార్కెట్లు జోరందుకున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. యూఎస్ మార్కెట్లు సైతం పుంజుకున్నప్పటికీ రానున్న రోజుల్లో హెచ్చుతగ్గులు ఎదురుకావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.



# నవీకరించిన ఐటీఆర్‌లతో ఖజానాకు రూ.9,118 కోట్లు




గడిచిన నాలుగేళ్లలో 90 లక్షలకు పైగా నవీకరించిన(అప్‌డేట్) ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు అయ్యాయి. వీటి ద్వారా కేంద్ర ఖజానాకు రూ.9,118 కోట్లు సమకూరినట్లు సోమవారం ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పన్నుదారులు స్వచ్ఛందంగా వివరాలు దాఖలు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహించినట్లు తెలిపారు. 2022లో అదనపు ఆదాయ పన్ను చెల్లించడం ద్వారా సంబంధిత మదింపు సంవత్సరం నుంచి రెండేళ్ల వరకు నవీకరించిన ఐటీ రిటర్న్‌లు(ఐటీఆర్‌యూ) దాఖలు చేసే అవకాశాన్ని ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. ఫైనాన్స్ బిల్లు, 2025 ద్వారా అప్‌డేటెడ్ రిటర్న్స్ దాఖలు చేయడానికి కాలపరిమితిని సంబంధిత మదింపు సంవత్సరం నుండి నాలుగు సంవత్సరాల వరకు పొడిగించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుత మదింపు సంవత్సరంలో (202425) ఫిబ్రవరి 28 వరకు 4.64 లక్షల అప్‌డేటెడ్ ఐటీఆర్‌లు దాఖలు అయ్యాయని, అందుకు రూ.431.20 కోట్ల పన్నులు చెల్లించామని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..202324 ఆర్థిక సంవత్సరంలో 29.79 లక్షల ఐటీఆర్‌యూలు దాఖలు కాగా రూ.2,947 కోట్ల అదనపు పన్నులు చెల్లించారు. 202223, ఏవై(అసెస్‌మెంట్ ఇయర్‌మదింపు సంవత్సరం) 202122 సంవత్సరాల్లో వరుసగా 40.07 లక్షలు, 17.24 లక్షల అప్‌డేటెడ్ ఐటీఆర్‌లు దాఖలు అయ్యాయి. వాటిల్లో అదనంగా రూ.3,940 కోట్లు, రూ.1,799.76 కోట్ల పన్నులు చెల్లించారు.

# కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు రూ.104.77 కోట్ల డిమాండ్ నోటీసులు




రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఆర్‌ఈఎల్) అనుబంధ సంస్థ అయిన కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు ఆదాయపు పన్ను శాఖ రూ.104.77 కోట్ల డిమాండ్ నోటీసులు పంపించింది. 202021, 202122 మదింపు సంవత్సరాలకు సంబంధించి ఈ నోటీసులు అందుకున్నట్లు సోమవారం సంస్థ తెలిపింది. ముంబైలోని సెంట్రల్ సర్కిల్ 6(2)లోని ఆదాయపు పన్ను అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం నుంచి ఈ నోటీసు పంపినట్లు ఆర్‌ఈఎల్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. ట్యాక్స్ కన్సల్టెంట్ల సలహా మేరకు కేర్ హెల్త్ నిర్ణీత గడువులోగా ఈ ఉత్తర్వులపై ఫోరమ్ ముందు అప్పీల్ దాఖలు చేస్తుందని ఆర్‌ఈఎల్ స్పష్టం చేసింది. ఈ డిమాండ్ నోటీసులకు దారితీసిన కచ్చితమైన లెక్కలు లేదా వివాదాల వెనుక ఉన్న వివరాలు బహిరంగంగా వెల్లడించలేదు. కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఈ ఆర్డర్‌ను అంతిమంగా అంగీకరించే ఉద్దేశం లేదని స్పష్టమవుతోంది. నిర్ణీత గడువులోగా ఈ నోటీసుపై అప్పీల్ దాఖలు చేస్తామని కంపెనీ ప్రకటించడంతో ఇది నిర్ధారణ అవుతుంది. హెల్త్ ఇన్సూరెన్స్ డొమైన్‌లో కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రముఖంగా సేవలందిస్తోంది. రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్‌కు ఇది కీలకంగా వ్యవహరిస్తోంది. పన్ను డిమాండ్‌ను సవాలు చేస్తూ తీసుకున్న నిర్ణయం దాని ఆర్థిక, చట్టపరమైన విధానాలపై విశ్వాసాన్ని సూచిస్తుంది. ఈ నోటీసుపై కంపెనీ ప్రతిస్పందనను పరిశ్రమ వాటాదారులు, రెగ్యులేటర్లు నిశితంగా పరిశీలిస్తున్నారు.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# పార్లమెంట్‌ను కుదిపేసిన డీకే శివకుమార్ వ్యాఖ్యలు




**బెంగళూరు /న్యూఢిల్లీ:** రిజర్వేషన్లపై కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు.. సోమవారం పార్లమెంట్ ఉభయ సభలను కుదిపేశాయి. డీకేఎస్ వ్యాఖ్యలతో రాజ్యాంగాన్నే మార్చేయాలన్న కాంగ్రెస్ మనస్తత్వం బయటపడిందని బీజేపీ విమర్శించగా.. ప్రతిపక్ష కాంగ్రెస్ గట్టి కౌంటరే ఇచ్చింది. ఈ క్రమంలో రాజ్యసభ 2గం.దాకా కార్యకలాపాలకు దూరంగా ఉండగా, లోక్‌సభ పదే పదే వాయిదా పడుతూ వచ్చింది. కర్ణాటక ప్రభుత్వం మైనారిటీ కోటా కింద కాంట్రాక్టులలో నాలుగు శాతం ముస్లింలకు కేటాయించడంపై బీజేపీ, కాంగ్రెస్‌లు విమర్శలతో పార్లమెంట్‌ను వేడెక్కించాయి. ప్రత్యేకించి ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం శివకుమార్ వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఇది రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు జేపీ నడ్డా అన్నారు. ''మతం పేరుతో రిజర్వేషన్లను రాజ్యాంగం అనుమతించలేదు. మైనార్టీలను కాంగ్రెస్ మభ్యపెడుతోంది. ఇలాంటి చట్టాలను(కర్ణాటక తెచ్చిన చట్టం గురించి ప్రస్తావిస్తూ..), విధానాలను ఉపసంహరించుకోవాలి. బీఆర్ అంబేద్కర్ మార్గదర్శకత్వంలో రూపొందించిన రాజ్యాంగాన్ని ఎవరూ మార్చలేరు'' అని నడ్డా అన్నారు. అయితే.. నడ్డా వ్యాఖ్యలకు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే కౌంటర్ ఇచ్చారు. రాజ్యాంగాన్ని మారుస్తానని డీకే శివకుమార్ అనలేదని.. ఆ మాటకి వస్తే బీజేపీ నేతలే రాజ్యాంగంపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేశారని అన్నారు. అంతేకాదు..గతంలో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ భారత రాజ్యాంగాన్ని మారుస్తానని బహిరంగంగా వ్యాఖ్యానించారని గుర్తు చేశారు.


ఈ అంశం ఇటు లోక్‌సభలోనూ దుమారం రేపగా.. సభ పదే పదే వాయిదా పడుతూ వచ్చింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజ్జు డీకేఎస్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఇది రాజ్యాంగంపై జరుగుతున్న దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ క్రమంలో.. కాంగ్రెస్ ఎంపీలు కౌంటర్‌లతో సభ హీటెక్కింది. మతపరమైన రిజర్వేషన్లు.. ప్రత్యేకించి ముస్లింల కోసం రాజ్యాంగానికి కొన్ని మార్పులు అవసరం అని శివకుమార్ అన్నట్లు ప్రచారం జరిగింది. అయితే తాను అనలేదని తాజాగా నడ్డా విమర్శల నేపథ్యంలో శివకుమార్ స్పందించారు. బీజేపీ తప్పుడు వార్తలను ప్రచారం చేస్తోంది. నేను JP నడ్డా కంటే ఎక్కువ సెన్సిబుల్, సీనియర్ పొలిటీషియన్ అని అన్నారు. నేను గత 36 ఏళ్లుగా అసెంబ్లీలో ఉన్నాను. నాకు ప్రాథమిక ఇంగితజ్ఞానం ఉంది. వివిధ నిర్ణయాల (కోర్టు ద్వారా) తర్వాత మార్పులు ఉంటాయని క్యాజువల్‌గా చెప్పాను. రాజ్యాంగాన్ని మార్చబోతున్నామని నేను ఎప్పుడూ చెప్పలేదని అన్నారు. మాది జాతీయ పార్టీ. మా పార్టీ ఈ దేశానికి రాజ్యాంగాన్ని తీసుకువచ్చింది అని అన్నారాయన.

# జస్టిస్ యశ్వంత్ తీర్పులన్నీ రివ్యూ చేయాలి



**న్యూఢిల్లీ:** అవినీతి ఆరోపణల అనంతరం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం తీసుకున్న తాజా నిర్ణయంపై పెద్ద ఎత్తున నిరసన గళం వినిపిస్తోంది. ప్రధానంగా అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు (న్యాయవాదులు) తమ నిరసన స్వరం పెంచారు. ఆ జడ్జి మాకొద్దంటూ ఇప్పటికే సీజేఐకి లేఖ రాసిన బార్ సభ్యులు.. మరోమారి అదే విషయాన్ని గట్టిగా నొక్కి చెబుతున్నారు. 'ఇప్పటికే చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాకు విషయాన్ని క్లియర్ గా లేఖ ద్వారా తెలియజేశాం. ఆయన్ని ఇక్కడకు(అలహాబాద్ హైకోర్టు) బదిలీ చేయవద్దని కోరాం. ఎందుకంటే ఏ కోర్టు అయినా చెత్త పడేసి ప్లేస్ కాదు కదా. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిగి క్లీన్ చీట్ వచ్చే వరకూ జస్టిస్ వర్మ అక్కడే ఉండాలి. జస్టిస్ వర్మ అక్కడే ఉంటే సుప్రీంకోర్టు కూడా ఆయనపై విచారణను చాలా దగ్గరగా పరిశీలించే అవకాశం ఉంటుంది. ఆయన ఇప్పటివరకూ ఇచ్చిన తీర్పులు అన్నింటిపై రివ్యూ చేయాలి. ప్రజల్లో నమ్మకం చూరగొనాలంటే ఆయన తీర్పులపై మళ్లీ సమీక్షలు అవసరం. సీబీఐ, ఈడీ వంటి సంస్థలతో దర్యాప్తు చేయించాలి' అని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ డిమాండ్ చేశారు.

# ఏప్రిల్ 28న కెనడాలో ఎన్నికలు



**ఒట్టావా:** కెనడాలో ఎన్నికల నగారా మోగింది. ఏప్రిల్ 28న ముందస్తు పోలింగ్ జరపనున్నట్లు ఆదివారం కెనడా ప్రధానమంత్రి కార్నీ ప్రకటించారు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక అగ్రరాజ్యం అమెరికాతో సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న వేళ ఆయనీ ప్రకటన చేయడం గమనార్హం. జస్టిన్ ట్రూడో పదవి నుంచి వైదొలగడంతో రెండు వారాల క్రితమే కార్నీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ముందస్తు ఎన్నికలపై ఊహాగానాలు వెలువడుతున్న వేళ ఆదివారం ఆయన గవర్నర్ జనరల్‌తో భేటీ అయి పార్లమెంట్‌ను రద్దు చేయాలని కోరారు. అక్టోబర్ 20న ఎన్నికలు జరగాల్సి ఉంది. అధికార లిబరల్ పార్టీకి అనుకూల పవనాలు వీస్తుండటంతో కార్నీ ముందస్తు నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.



# చైనాలో మెగా ఫ్యాక్టరీ.. అమెరికా సిటీ కంటే పెద్దగా..

**బీజింగ్:** వినూత్న, భారీ ప్రాజెక్టులకు పెట్టింది పేరైన చైనా దేశం మరోమారు తన భారీతనాన్ని చాటుకుంటోంది. ఏకంగా ఒక నగరం కంటే పెద్ద స్థాయిలో నూతనంగా ఫ్యాక్టరీని నిర్మిస్తోంది. అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో సిటీ కంటే ఎక్కువ విస్తీర్ణంలో అంటే దాదాపు 32,000 ఎకరాల విస్తీర్ణంలో ఈ కర్మాగారం నిర్మాణ పనులు చకచకా పూర్తవుతున్నాయి. చైనాలోని హెనాన్ ప్రావిన్సులోని ఝెన్‌ఝౌ నగరం శివారు ప్రాంతంలో బీవైడీ సంస్థ ఈ ఫ్యాక్టరీని నిర్మిస్తోంది. అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలను ఈ కర్మాగారంలో తయారుచేయనున్నారు. తాజాగా ఈ ఫ్యాక్టరీకి సంబంధించిన ఒక డ్రోన్ వీడియో ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమవడంతో సామాజిక మాధ్యమాల్లో దీని గురించి చర్చ మొదలైంది. ఉత్పత్తి యూనిట్లు, పెద్ద భవనాలు, టెన్నిస్ కోర్టు, ఫుట్‌బాల్ మైదానాలతో సకల సదుపాయాలతో కర్మాగార పనులు కొనసాగుతున్నాయి. రోజు ఇక్కడ పనిచేసే కార్మికులతో ఇప్పటికే ఈ ప్రాంతం కొత్త సిటీలా మారిపోయిందని డ్రోన్ వీడియోను చూస్తే అర్థమవుతోంది. ఇప్పటికే ఇదే ప్రాంత సమీపంలో బీవైడీ కంపెనీకి ఒక ఫ్యాక్టరీ ఉంది. ఈ ఫ్యాక్టరీ.. అమెరికాలో నెవడా రాష్ట్రంలో విద్యుత్‌కార్ల దిగ్గజం టెస్లాకు చెందిన ఫ్యాక్టరీ కంటే విస్తీర్ణంలో పెద్దదికావడం విశేషం. కొత్త ఫ్యాక్టరీని ఎనిమిది బ్లాకులుగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే బీవైడీ కంపెనీకి ప్రపంచవ్యాప్తంగా 9,00,000 మంది సిబ్బంది ఉన్నారు. మరో మూడు నెలల్లో 2,00,000 మంది సిబ్బందిని కొత్తగా నియమించుకోనున్నారు. ఝెన్‌ఝౌ నగరంలో నిర్మిస్తున్న కొత్త కర్మాగారంలో రోజు 60,000 మంది కార్మికులు పనిచేస్తుండటంతో ఇప్పుడు అదొక కొత్త సిటీలా కనిపిస్తోందని ఒక నెటిజన్ అన్నారు.

# ఎంపీల జీతభత్యాలు పెంచిన కేంద్రం



**న్యూఢిల్లీ :** ఎంపీల జీతభత్యాల విషయంలో కేంద్రం సోమవారం కీలక ప్రకటన చేసింది. ఉభయ సభల్లోనూ ఎంపీలకు జీతాలను పెంచుతున్నట్లు సోమవారం అధికారికంగా పార్లమెంట్ వ్యవహారాల శాఖ ఓ నోటిఫికేషన్ ద్వారా తెలియజేసింది. ఇక్కడ కొసమెరుపు ఏంటంటే.. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచే ఈ పెంపు అమల్లో ఉండడం. ప్రస్తుతం ఎంపీల జీతం రూ. లక్ష ఉండగా.. దానిని లక్షా 24 వేలకు పెంచింది. అలాగే దినసరి భత్యం రూ.2 వేల నుంచి 2,500కు పెంచింది. మాజీ ఎంపీల పెన్షన్ రూ.25 వేల నుంచి 31 వేలకు పెంచినట్లు తెలిపింది. ఈ మేరకు సంబంధిత పార్లమెంట్ యాక్ట్ 1954కు సవరణ చేసింది. అయితే రెండేళ్లుగా ఇది ఆచరణలో ఉన్నప్పటికీ.. చట్టసభ సభ్యులకు పరిహారాన్ని పెంచాలనే ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా ఈ 'సర్దుబాట్ల'ను అధికారికంగా తెలియజేసిందంతే. ఇటీవలే కర్ణాటక ప్రభుత్వం చట్ట సభ్యుల జీతాలను 100 శాతం పెంచుకుని వార్తల్లోకి ఎక్కిన విషయం తెలిసిందే. అదే సమయంలో ఆ నిర్ణయంపై తీవ్రస్థాయిలో విమర్శలూ చెలరేగుతున్నాయి.



# కేఎల్ రాహుల్‌కు ప్రమోషన్

## తండ్రయిన స్టార్ క్రికెటర్

## పాప పుట్టిందంటూ పోస్ట్

క్రికెటర్ కేఎల్ రాహుల్, బాలీవుడ్ నటి అతియా శెట్టి పేరెంట్స్‌గా ప్రమోషన్ పొందారు. గతేడాది తాను ప్రెగ్నెంట్ అని చెప్పిన అతియా.. తాజాగా సోమవారం (మార్చి 24) పాపకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని వీళ్లు సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు.

**రాహుల్, అతియా.. ఓ పాప**

బాలీవుడ్ సీనియర్ నటుడు సునీల్ శెట్టి కూతురైన అతియా శెట్టి, టీమిండియా స్టార్ ప్లేయర్ కేఎల్ రాహుల్ కు పాప పుట్టింది. బ్లెస్డ్ విత్ ఎ బేబీ గర్ల్ అంటూ ఈ జంట తమ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. రెండు హంసలు ఉన్న ఓ పెయింటింగ్ ను పోస్ట్ చేస్తూ ఈ విషయం తెలిపారు. సోమవారం (మార్చి 24) ఈ పాప జన్మించింది. వాళ్లకు ఇదే తొలి సంతానం. ఈ పోస్టుపై అభిమానులు శుభాకాంక్షలు చెబుతూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. అతియా ప్రసవానికి సిద్ధంగా ఉండటంతో ఐపీఎల్లో ఢిల్లీ, లక్నో మ్యాచ్ కు రాహుల్ దూరమయ్యాడు. ఈ కొత్త సీజన్లో అతడు లక్నోని వీడి ఢిల్లీ తరపున ఆడుతున్న విషయం తెలిసిందే.

**పెళ్లయిన రెండేళ్లకు..**

అతియా, రాహుల్ లవ్ స్టోరీ 2019లోనే మొదలైంది. వీళ్లు ఓ ఫ్రెండ్ ద్వారా కలుసుకున్నారు. తర్వాత వీళ్ల స్నేహం కాస్తా ప్రేమగా మారింది. కొన్నేళ్లపాటు డేటింగ్ చేశారు. మొత్తానికి 2023లో పెళ్లితో ఒక్కటయ్యారు. ఖండాలాలోని సునీల్ శెట్టి ఫామ్ హౌజ్ లో వీళ్ల పెళ్లి జరిగింది. వీళ్ల పెళ్లికి కేవలం సన్నిహితులు, కుటుంబ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఇక గతేడాది నవంబర్ లో అతియా తన తొలి ప్రెగ్నెన్సీని అనౌన్స్ చేసింది. 2025లో తమ తొలి సంతానం రాబోతున్నట్లు ఈ జంట తెలిపింది.





# దేవర జపాన్ ప్రమోషన్స్

## ఆయుధ పూజ హుక్ స్టెప్ వేసిన తారక్

జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం దేవర. కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ మూవీ రెండు పార్టులుగా వస్తుండగా.. దేవర పార్టు 1 2024 సెప్టెంబర్ 27న గ్రాండ్‌గా విడుదలై బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. దేవర పార్టు 1 మార్చి 28న జపాన్‌లో గ్రాండ్‌గా విడుదల కానుండగా.. ప్రస్తుతం తారక్ అండ్ కొరటాల శివ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. ఈ సినిమాలో ఆయుధ పూజ సాంగ్ ఏ రేంజ్‌లో ఫేమస్ అయ్యిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా ఇదే పాటకు తారక్ చాలా రోజుల తర్వాత మరోసారి అదిరిపోయే స్టెప్పులేశాడు. బ్లాక్ కాస్ట్యూమ్‌లో స్టైలిష్ గాగుల్స్ పెట్టుకున్న తారక్ స్టేజ్‌పై మాస్క్ పెట్టుకున్న అభిమానితో కలిసి హుక్ స్టెప్ వేశాడు. ఇప్పుడీ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఫిషింగ్ హార్బర్ విలేజ్, పోర్ట్ మాఫియా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటించగా.. ప్రకాశ్ రాజ్, షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. ఈ చిత్రానికి పాపులర్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించాడు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా తెరకెక్కించారు.

# ఆ డిజాస్టర్ మూవీ కోసం ఛావా సినిమాకు కీర్తి సురేశ్ నో చెప్పారట!

ఆ డిజాస్టర్ మూవీ కోసం ఛావా సినిమాకు కీర్తి సురేశ్ నో చెప్పారట! బిజీగా ఉండడం వల్లనో, పాత్ర సూటవకపోవటం వల్లనో లేకపోతే ఇతర కారణాలతో కొందరు సినీ తారలు కొన్ని చిత్రాలను తిరస్కరిస్తుంటారు. ఒకవేళ వాళ్లు వద్దనుకున్న సినిమా భారీ బ్లాక్‌బస్టర్ అయిందంటే దాని గురించి చర్చ జరుగుతుంటుంది. ప్రస్తుతం స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ విషయంలో ఇది జరుగుతోంది. భారీ బ్లాక్‌బస్టర్ అయిన ఛావా చిత్రంలో ముందు కీర్తి సురేశ్‌కు అవకాశం వచ్చిందట. ఆమె వేరే మూవీ కోసం ఈ ఆఫర్ తిరస్కరించారనే రూమర్లు వస్తున్నాయి.

**బేబీజాన్ కోసం ఛావాకు నో!**

ఛావా సినిమాలో రష్మిక మందన్నా పోషించిన యేసుభాయి పాత్ర కోసం ముందుగా కీర్తి సురేశ్‌నే మేకర్స్ సంప్రదించారట. కానీ బేబీజాన్ చిత్రంలో బిజీగా ఉన్న కీర్తి.. ఈ ఆఫర్ వద్దన్నారనే రూమర్లు చక్కర్లు కొడుతున్నాయి. బేబీజాన్ కోసం ఛావాకు కీర్తి నో చెప్పారనే పుకార్లు సోషల్ మీడియాలో వస్తున్నాయి.

**బేబీజాన్ డిజాస్టర్.. ఛావా భారీ బ్లాక్‌బస్టర్**

బేబీజాన్ చిత్రంతోనే బాలీవుడ్‌లోకి కీర్తి ఎంట్రీ ఇచ్చారు. వరుణ్ ధావన్ సరసన ఈ మూవీలో హీరోయిన్‌గా నటించారు. తమిళ మూవీ తేరికి హిందీ రీమేక్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు కలీస్. గతేడాది డిసెంబర్ 25వ తేదీన థియేటర్లలో విడుదలైన బేబీజాన్ భారీ డిజాస్టర్ అయింది. సుమారు రూ.180కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం రూ.60కోట్ల కలెక్షన్ల మార్క్ కూడా దాటలేకపోంది. బాక్సాఫీస్ వద్ద భారీగా ఫెయిల్ అయింది.విక్కీ కౌశల్, రష్మిక మందన్నా ప్రధాన పాత్రలు పోషించిన ఛావా చిత్రం భారీ బ్లాక్‌బస్టర్ సాధించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 14వ తేదీన విడుదలైన ఈ హిస్టారికల్ యాక్షన్ సినిమా ఇప్పటి వరకు రూ.750కోట్ల గ్రాస్ కలెక్షన్లను దాటేసింది. ఇంకా థియేట్రికల్ రన్ కొనసాగుతోంది. లక్ష్మణ్ ఉతేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఛత్రపతి సంభాజీ మహరాజ్‌గా విక్కీ నటించగా.. ఆయన భార్య యేసుభాయి పాత్రను రష్మిక చేశారు. సుమారు రూ.130కోట్ల బడ్జెట్‌తో ఈ మూవీ రూపొందింది. డిజాస్టర్ బేబీజాన్ కోసం ఛావా చిత్రాన్ని కీర్తి సురేశ్ వద్దనుకున్నారంటూ సోషల్ మీడియాలో ప్రస్తుతం రూమర్లు గుప్పుమంటున్నాయి.

## క్రీడా వార్తలు | SPORTS NEWS



# ఒంటి చేత్తో ఢిల్లీని గెలిపించిన అశుతోశ్ శర్మ

ఉత్కంఠ భరిత పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ (DC vs LSG) బ్యాటర్ అశుతోశ్ శర్మ (31 బంతుల్లో 66 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుతాన్ని చేసి చూపించాడు. గెలిచే ఆశలు లేని చోట తన అద్భుత పోరాటంతో విజయాన్ని సాధించాడు. చివరి ఓవర్ వరకు ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో లక్నో సూపర్ జెయింట్స్ (LSG vs DC)పై ఢిల్లీ క్యాపిటల్స్ వికెట్ తేడాతో విజయాన్ని అందుకుంది. 210 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 19.3 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 211 పరుగులు చేసి గెలుపొందింది. చివరి ఓవర్లో 6 పరుగులు అవసరం కాగా.. 3వ బంతిని సిక్సర్ బాదిన అశుతోశ్ ఢిల్లీకి అద్భుత విజయాన్ని సాధించి పెట్టాడు. నిగమ్ (15 బంతుల్లో 39; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), స్టబ్స్ (22 బంతుల్లో 34; 1 ఫోర్, 3 సిక్సర్లు) రాణించారు. లక్నో బౌలర్లలో శార్దుల్ ఠాకూర్, సిద్ధార్థ్, రాతి, రవి బిష్ణోయ్ లు తలా రెండేసి వికెట్లు సాధించారు.

**వారెవ్వా అశుతోశ్**

19వ ఓవర్ 3వ బంతికి ఢిల్లీ క్యాపిటల్స్ 9వ వికెట్ ను కోల్పోయింది. ఈ దశలో ఢిల్లీ గెలవాలంటే 9 బంతుల్లో 18 పరుగులు చేయాల్సి ఉంది. చేతిలో ఒక్క వికెట్ మాత్రమే ఉంది. అయితే ఇక్కడే అద్భుతం జరిగింది. అప్పటి వరకు చూసి ఆడుతున్న అశుతోశ్ శర్మ.. ఒక్కసారిగా బీస్ట్ మోడ్ లోకి వెళ్లిపోయాడు. 19వ ఓవర్ చివరి మూడు బంతులను వరుసగా 2, 6, 4 బాదాడు. దాంతో ఢిల్లీ విజయ సమీకరణం 6 బంతులకు 6 పరుగులకు చేరుకుంది. అయితే ఓవర్ పూర్తవ్వడంతో అశుతోశ్ శర్మ నాన్ స్ట్రయికింగ్ ఎండ్ కు పరిమితం అయ్యాడు. ఇక చివరి ఓవర్ ను లక్నో కెప్టెన్ రిషభ్ పంత్ షాబాజ్ కు ఇచ్చాడు. స్ట్రయికింగ్ ఎండ్ లో ఉన్న మోహిత్ శర్మ తొలి బంతిని ఆడే ప్రయత్నం చేయగా.. బంతి ప్యాడ్లను తాకుతూ వెళ్లిపోయింది. రిషభ్ పంత్ ఎల్బీ కోసం అప్పీల్ చేయగా.. అంపైర్ తిరస్కరించాడు. వెంటనే రిషభ్ పంత్ రివ్యూ తీసుకున్నాడు. రివ్యూలో నాటౌట్ అని తేలింది. ఆ తర్వాతి బంతికి మోహిత్ శర్మ సింగిల్ తీశాడు. ఇక 20వ ఓవర్ 3వ బంతిని సిక్సర్ బాదిన అశుతోశ్ ఢిల్లీ క్యాపిటల్స్ కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

**ఎవరీ అశుతోష్?**

26 ఏళ్ల అశుతోష్ రాంబాబు శర్మ.. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మధ్యప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 8 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు, 7 లిస్ట్-ఏ, 31 టీ20లు ఆడాడు. ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు చేసిన అశుతోష్.. టీ20ల్లో 47 అర్ధసెంచరీలు నమోదు చేశాడు. ఇక అశుతోష్ ఐపీఎల్ అభిమానులకు సుపరిచితడే. ఐపీఎల్-2024 సీజన్‌తో పంజాబ్ కింగ్స్ తరపున అశుతోష్.. ఈ క్యాష్ రిచ్ లీగ్‌లోకి అడుగుపెట్టాడు. మినీ వేలంలో పంజాబ్ కింగ్స్ తన బేస్ ధర రూ. 20 లక్షలకు సొంతం చేసుకుంది. గతేడాది సీజన్‌లో ఏ మాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన తన అద్భుత ప్రదర్శనతో రెండు మ్యాచ్‌ల్లో పంజాబ్‌ను గెలిపించాడు. అయినప్పటికి పంజాబ్ మాత్రం ఐపీఎల్-2025 మెగా వేలానికి ముందు విడిచిపెట్టింది. దీంతో వేలంలోకి వచ్చిన ఈ పవర్ హిట్టర్‌ను రూ.3.8 కోట్లకు ఢిల్లీ కొనుగోలు చేసింది. ఢిల్లీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఈ మధ్యప్రదేశ్ క్రికెటర్ నిలబెట్టుకున్నాడు.

# ఐపీఎల్ హిస్టరీలోనే కాస్ట్లీ ప్లేయర్.. కట్ చేస్తే!


## తొలి మ్యాచ్‌లోనే డకౌట్



ఐపీఎల్ 2025ను లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ పేలవంగా ఆరంభించాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ఖరీదైన ఆటగాడిగా నిలిచిన రిషబ్ పంత్.. తొలి మ్యాచ్‌లోనే తీవ్ర నిరాశపరిచాడు. ఈ మెగా టోర్నీలో భాగంగా వైజాగ్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో పంత్ డకౌటయ్యాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన పంత్.. ఆరు బంతులు ఎదుర్కొని ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో ఫాఫ్ డుప్లెసిస్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో పంత్‌ను నెటిజన్లు ట్రోలు చేస్తున్నారు. ఈ మాత్రం ఆటకేనా రూ. 27 కోట్లు అంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. కాగా గతేడాది జరిగిన మెగా వేలంలో రూ. 27 కోట్ల భారీ ధరకు పంత్‌ను లక్నో కొనుగోలు చేసింది. ఇక ఈ మ్యాచ్‌లో పంత్ విఫలమైనప్పటికి మిగితా బ్యాటర్లు మాత్రం విధ్వంసం సృష్టించారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. లక్నో బ్యాటర్లలో మిచెల్ మార్ష్(36 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 72), నికోలస్ పూరన్(30 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లతో 75 పరుగులు) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. ఓ దశలో ఈజీగా 250 పైగా లక్నో స్కోర్ దాటుతుందని భావించారు. కానీ 15 ఓవర్ల తర్వాత ఢిల్లీ బౌలర్లు కమ్‌బ్యాక్ ఇచ్చారు. ఢిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు, కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు సాధించగా.. విప్రాజ్ నిగమ్, ముఖేష్ కుమార్ తలా వికెట్ సాధించారు.

# నికోలస్ పూరన్ విధ్వంసం.. వరుసగా 4 సిక్సర్లు!

ఐపీఎల్ 2025లో వైజాగ్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ స్టార్ ప్లేయర్ నికోలస్ పూరన్ విధ్వంసకర ప్రదర్శన చేశాడు. ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పూరన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. 17 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న పూరన్.. ఆ తర్వాత సిక్సర్ల వర్షం కురిపించాడు. ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోశాడు. ఈ క్రమంలో పూరన్ కేవలం 24 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ముఖ్యంగా పార్ట్ టైమ్ బౌలర్ ట్రిస్టన్ స్టబ్స్‌ను ఈ కరీబియన్ వికెట్ కీపర్ బ్యాటర్ ఊతికారేశాడు. లక్నో ఇన్నింగ్స్ 13వ ఓవర్ వేసిన స్టబ్స్ బౌలింగ్‌లో పూరన్ వరుసగా 4 సిక్సర్లు, ఒక ఫోర్ బాదాడు. దీంతో ఆ ఓవర్‌లో ఏకంగా 28 పరుగులు వచ్చాయి. అతడి ఇన్నింగ్స్‌కు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. పూరన్ ఓవరాల్‌గా 30 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లతో 75 పరుగులు చేశాడు. అతడితో పాటు మిచెల్ మార్ష్ కూడా తుపాన్ ఇన్నింగ్స్ ఆడాడు. మార్ష్ 36 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 72 పరుగులు చేశాడు. వీరిద్దరి విధ్వంసం ఫలితంగా తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఢిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు, కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు సాధించగా.. విప్రాజ్ నిగమ్, ముఖేష్ కుమార్ తలా వికెట్ సాధించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com